జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | గురువారం 22 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 253 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## ఢిల్లీ అతలాకుతలం

- ఢిల్లీలో పెనుగాలుల బీభత్సం.. అంధకారం!
- శ్రీనగర్ వెళుతున్న ఇండిగో విమానంలో భారీ కుదుపులు
- ఢిల్లీ, నోయిడాల్లో ఈదురుగాలులు, వర్షం
- గంటకు 79 కి.మీ వేగంతో వీచిన ఈదురుగాలులు
- నేలకూలిన హోర్డింగ్‌లు, విరిగిపడ్డ చెట్లు, పలుచోట్ల విద్యుత్ కట్
- విమాన సర్వీసులపై ప్రభావం, ప్రయాణికులకు ఎయిర్‌లైన్స్ సూచనలు



## కార్యకర్తల బాధ్యత తీసుకుంటా.. ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటా

**అమరావతి:**

వైకాపా హయాంలో హత్యకు గురైన రొంపిచర్ల మండల తెదేపా అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని లోకేశ్ భరోసా ఇచ్చారు. కార్యకర్తల బాధ్యత తీసుకుంటూ, పార్టీ కోసం కష్టపడిన వారి ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. హత్య ఘటన పూర్వాపరాలు, వెన్నా నాగేంద్రమ్మ ఆరోగ్య పరిస్థితిపై లోకేశ్ వాకబు చేశారు. హత్యకేసులో నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని, కేసు పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు కోరారు. ఆర్థికంగా చాలా నష్టపోయామని, ఉపాధి హామీ, గృహనిర్మాణం బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పాటు, తాము - మిగతా3లో

## యోగాకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి

3

# ప్రధాని మోదీ

- ప్రపంచానికి భారత్ అందిస్తున్న వరం యోగా
- ప్రపంచంలో అన్ని దేశాల్లో నిర్వహించుకునే కార్యక్రమం యోగా
- ఇది కొద్ది మందికో, కొన్ని ప్రాంతాలకో పరిమితమైంది కాదు
- ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరం



**అమరావతి**

11వ యోగా ఇంటర్నేషనల్ డేను ఆంధ్రప్రదేశ్‌లో ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. నాగరికతకు భారతదేశం పెట్టింది పేరన్నారు. యోగా మన వారసత్వమని.. యోగా ఇంటర్నేషనల్ డేగా గుర్తింపు రావడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కారణమన్నారు. యోగా మెరుగైన జీవనానికి దోహద పడుతుందని తెలిపారు. నేడు ప్రపంచంలో అన్ని దేశాల్లో జరుపుకునే కార్యక్రమం యోగా అని చెప్పుకొచ్చారు. యోగా అనేది కొద్దిమందికో లేక.. కొన్ని ప్రాంతాలకో సంబంధించింది కాదన్నారు. అందరి జీవితాల్లో యోగా అనేది ఒక భాగం కావాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరం యోగా అని చెప్పుకొచ్చారు. ఫొటోలు, ఈవెంట్ కోసం ఒక రోజు చేసే కార్యక్రమం కాదన్నారు. ప్రతి ఒక్కరిలో ప్రగాఢమైన మార్పు తీసుకొచ్చే కార్యక్రమం యోగా అని - మిగతా3లో

## కీలక రాజకీయాంశాలపై వైఎస్ జగన్ ప్రెస్‌మీట్



**గుంటూరు**

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రేపు మీడియా సమావేశం నిర్వహించనున్నారు. కీలక రాజకీయ అంశాలపై ఆయన మీడియా ద్వారా ప్రజలకు సందేశం ఇస్తారని పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో పాటు ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు తగినంత సమయం మైక్ ఇవ్వని పరిస్థితుల్లో తాను మీడియా ముందుకు వచ్చి మాట్లాడతానంటూ వైఎస్ జగన్ కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తొలినాళ్లలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అధికారంతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రతీకార రాజకీయాలను ఆయన ఎండగడుతూ వస్తున్నారు. అంతేకాదు.. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కొనసాగిన సంక్షేమం ఆగిపోవడం, ఉద్దేశపూర్వకంగా అన్ని వర్గాల లబ్ధిదారులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుండడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రేషన్ డెలివరీ వాహనాలను నిలిపివేయడం లాంటి.. తాజా అంశాలపైనా ఆయన మాట్లాడే అవకాశం కనిపిస్తోంది.



## సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులు ఇష్టపడరు

- అయినా పెండింగ్ కేసులపై నింద భరించాలి
- సుప్రీం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్
- పాక్షిక న్యాయస్థాన పనిదినాల్లో రెండు నుంచి ఐదు వరకు వెకేషన్ బెంచ్‌లు పనిచేస్తున్నాయి

## అమెరికా గోల్డెన్ డోమ్.. భారత్ ఐరన్ డోమ్ ఇదే

వివరాలు 3లో..

## యూపీఐ లావాదేవీలు ఇక మరింత సురక్షితం

- కేంద్రం కీలక ఆవిష్కరణ
- మొబైల్ ఆర్థిక మోసాల కట్టడికి కేంద్రం చర్యలు
- 'ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్' (ఎఫ్ఆర్ఐ) ఆవిష్కరణ
- ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే వంటి సంస్థలకు డిఐపి హెచ్చరికలు
- అనుమానిత నంబర్లకు రిస్క్ ఆధారిత వర్గీకరణ

## ఉనికిని కోల్పోయిన

# ఏవోబీ కమిటీ



- దళపతిని కోల్పోయిన మావోయిస్టులు
- ఒక్క ఏడాదిలోనే 540 మంది ఎన్‌కౌంటర్
- ఖాళీ అయిన దండకారణ్య స్పెషల్ జోన్
- మే నెల మావోయిస్టు పార్టీ ఉనికికి కీలకమైనది
- మరో నాలుగు రోజుల్లో, అంటే ఈ నెల 25న నక్సల్బరీ ఆవిర్భావ దినోత్సవం

**అమరావతి/హైదరాబాద్**

భారత విప్లవోద్యమ చరిత్రలో తొలిసారి మావోయిస్టులు తమ దళపతిని ఎన్‌కౌంటర్‌లో కోల్పోయారు. కేంద్రం సాగిస్తున్న సాంకేతిక యుద్ధంతో ఏడాది కాలంగా విలవిల్లాడుతున్న మావోయిస్టులకు ఇది శరాఘాతమే.! వెన్ను విరిగినట్టే! మే నెల మావోయిస్టు పార్టీ ఉనికికి కీలకమైనది. మరో నాలుగు రోజుల్లో, అంటే ఈ నెల 25న నక్సల్బరీ ఆవిర్భావ దినోత్సవం రాబోతుంది. అలాంటి మే నెలలోనే నక్సల్స్‌కు ఊహించని దెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్‌లో జరిగిన హోరాహోరీ ఎదురు కాల్పుల్లో బుధవారం ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మరణించారు. ఈ సంఘటన మావోయిస్టుల ఏరివేత యుద్ధం చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలకు పెద్ద విజయమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 'ఎక్స్'లో ప్రకటించారు. బస్వరాజ్ మరణం మావోయిస్టు పార్టీకి ఎంత నష్టం అనేదానికి ఈ ప్రకటనే సాక్ష్యం. మావోయిస్టు పార్టీకి కేంద్ర కమిటీ అంటేనే నిర్దేశిత వ్యవస్థ. ఆ కమిటీకి ప్రధాన కార్యదర్శి అంటే గుండెకాయ. కేంద్ర బలగాలు ఆ గుండెకాయను మట్టుబెట్టాయి. కేంద్రం 2026 మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా - మిగతా2లో



## సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నాం

- ప్రధాని నరేంద్ర మోదీ
- సంఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి
- ఆపరేషన్‌లో చాలా మంది మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారని అంచనా.
- మావోయిజం ముప్పును తొలగించేందుకు, ప్రజలకు శాంతియుత, ప్రగతిశీల జీవితాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది

3

## వైసీపీలో నెంబర్ 2 చర్చ

- ఉత్కంఠభరితంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మారాయి.
- (వైసీపీ) అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అరెస్ట్ అవుతారనే వార్తలు
- టీడీపీ అనుకూల మీడియా ఈ అంశంపై డేట్, టైం ఫిక్స్ చేసి ఊహాగానాలను రేకెత్తిస్తోంది
- లిక్కర్ స్కామ్‌తో జగన్ అరెస్ట్ అనివార్యమని కొన్ని మీడియా సంస్థలు జోస్యం చెబుతున్నాయి
- బెంగళూరులో జగన్‌ను అరెస్ట్ చేసి రోడ్డు మార్గంలో గంటలపాటు తిప్పి తీసుకొస్తారని ప్రచారం

# అమెరికా గోల్డెన్ డోమ్.. భారత్ ఐరన్ డోమ్ ఇదే

ఢిల్లీ




అతి శక్తిమంతమైన ఆయుధాలు. అంతకు మించిన నిఘా సంపత్తి. అవడానికి చిన్న దేశమే అయినా సైనిక సంపత్తిలో మాత్రం ఇజ్రాయెల్ అక్షరాలా అమేయ శక్తే. సుదీర్ఘంగా కొనసాగుతున్న యుద్ధంలో అటు ఇరాన్, ఇటు హిజ్బొల్లాలు ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడి చేశాయి. అయితే ఈ దాడిలో రాకెట్లను ఐరన్ డోమ్ అడ్డగించింది. రాడార్ టెక్నాలజీ సాయంతో అడ్డగించి తుత్తునియలు చేసి తన సామర్థ్యం ఏంటో ఇజ్రాయెల్ ప్రపంచానికి చాటి చెప్పింది. దీంతో ఇప్పుడు ఈ ఐరన్ డోమ్ వ్యవస్థపై ప్రపంచ దేశాలు కన్నేశాయి. మొబైల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఐరన్‌డోమ్‌తో శత్రు దుర్భేద్య దేశంగా పేరొందేందుకు భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. ఇప్పుడీ ఐరన్ డోమ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. అమెరికాను బాలిస్టిక్,క్రూజ్ క్షిపణుల దాడుల నుంచి రక్షించేందుకు 175 బిలియన్ డాలర్ల వ్యవస్థతో గోల్డెన్ డోమ్‌ను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో అసలు ఐరన్ డోమ్ అంటే ఏంటి? ఎలా పనిచేస్తుంది? ఇది ఎలా పనిచేస్తోంది?వంటి వివరాలు చూద్దాం.

**గోల్డెన్ డోమ్ అంటే ఏమిటి?**

గోల్డెన్ డోమ్ అనేది అమెరికా కోసం రూపొందించబడిన అంతరిక్ష ఆధారిత క్షిపణి నిరోధక కవచం. శత్రువులు ప్రయోగించిన రాకెట్లను భూమి మీదకు చేరుకునే లోపే అడ్డుకునేలా టెక్నాలజీని వినియోగిస్తోంది. ఉదాహరణకు ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌లు భూమి మీద ఉన్న ఇంటర్‌సెప్టర్లు (%×త్వతీషవజ్‌శీతీం%) ఆధారంగా పనిచేస్తే, అమెరికా గోల్డ్ డోమ్ పూర్తిగా అంతరిక్షంలో శాటిలైట్ ద్వారా పనిచేస్తాయి. ఈ గోల్డెన్ డోమ్‌లో శాటిలైట్స్ ఉంటాయి. ఇవి క్షిపణులు ఎగురటం ప్రారంభమైన వెంటనే వాటిని గుర్తించి, ప్రారంభ దశలోనే వాటిని నిలువరించే సామర్థ్యం సత్తా దీని సొంతం.

ఈ సాంకేతికత అమెరికా భూమిపైకి మాత్రమే కాకుండా ఇతర ఖండాల నుండి లేదా అంతరిక్షం నుండి వచ్చే క్షిపణుల నుండి కూడా రక్షణ కలిగిస్తుంది. ఇది చైనా, రష్యా, ఉత్తర కొరియా, భవిష్యత్తులో ఇరాన్ లాంటి దేశాలు తలపెట్టే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అమెరికా రూపొందిస్తోంది.బాలిస్టిక్, హైపర్‌సోనిక్, క్రూయిజ్ క్షిపణుల నుంచి దేశాన్ని రక్షిస్తోంది. గోల్డెన్ డోమ్‌లో అవుటర్ లేయర్ స్పేస్ బేస్డ్ ఇన్‌ఫ్రారెడ్ సిస్టమ్ (%హదీ×=ూ%),గ్రౌండ్-బేస్డ్ రాడార్స్‌తో పాటు,మిసైల్ లాంఛర్లను అడ్డుకుంటుంది.

**భారత్‌కు ఆకాశ్**

ఇజ్రాయెల్ ఐరన్ డోమ్, అమెరికా గోల్డెన్‌డోమ్.. భారత్‌కు ఆకాశ్. ఆకాశ్ భారత్ క్షిపణి రక్షక వ్యవస్థ. 30 కి.మీ. దూరంలో, 18,000 మీ. ఎత్తులో ఎగురుతున్న శత్రు విమానాల్ని కూల్చేస్తుంది. గాల్లో ఎగురుతున్న యుద్ధ విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, గాలి నుండి భూమికి ప్రయోగించే క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులనూ నిర్వీర్యం చెయ్యగల సామర్థ్యం ఈ క్షిపణికి ఉంది. ఒక్కో ఆకాశ్ బ్యాటరీలో నాలుగు లాంచర్లు, ఒక్కో లాంచరులో మూడేసి క్షిపణులూ ఉంటాయి. ఇందులో ఒక రాజేంద్ర 3డీ పాసివ్ ఎలక్ట్రానికల్లీ స్కాన్‌డ్ ఎర్రే రాడార్ కూడా ఉంటుంది. ప్రతీ బ్యాటరీ ఏకకాలంలో 64 లక్ష్యాలను పరిశీలిస్తుంది. వాటిలో 12 లక్ష్యాలను ఛేదించగలదు.ఒక్కో క్షిపణిలో 60 కిలోగ్రాము శకలాలతో కూడుకున్న వార్‌హెడ్ ఉంటుంది.ఆకాశ్ వ్యవస్థ తేలిగ్గా ఎక్కడికంటే అక్కడికి తరలించవచ్చు.

# ధర్మమే గెలుస్తుంది

నల్లగొండ

కాంగ్రెస్ ప్రభుత్వం తమ కమీషన్లు, దందాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే విచారణ కమిషన్లు, నోటీసులు అంటూ డ్రామాలాడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాపాలన అంటూనే పర్సంటేజీల పాలనగా మార్చేశారని దుయ్యబట్టారు. స్వయంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, చివరికి రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు సైతం ప్రభుత్వ పెద్దల 20 శాతం, 30 శాతం కమీషన్ల గురించి నిజాలు బయటపెడుతున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలడానికి ప్రభుత్వ పెద్దల కమీషన్ల కక్కుర్తే కారణమని విమర్శించారు.

ఇలాంటివన్నీ కప్పిపుచ్చుకొనేందుకే కమిషన్ల పేరిట నాటకాలు ఆడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని డ్రామాలాడినా అవన్నీ దూది పింజల్లా తేలిపోవడం ఖాయమని చెప్పారు. నల్లగొండలో బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, బీఆర్ఎస్‌వీ మాజీ నాయకుడు జిల్లా శంకర్ వివాహానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై దంపతులను ఆశీర్వదించారు. అనంతరం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పెద్దలు ప్రతి పనిలో వసూలు చేస్తున్న కమీషన్ల మీద రాష్ట్రం మొత్తం గగ్గోలు పెడుతున్నదని విమర్శించారు. చిన్న చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లు సైతం ఏకంగా సచివాలయంలో ధర్నాకు దిగి 20 శాతం, 30 శాతం కమీషన్ల వ్యవహారాన్ని బట్టబయలు చేశారని గుర్తుచేశారు. చివరికి ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం కమీషన్లు లేనిది, పైసలు లేనిది ఈ ప్రభుత్వంలో పనులు కావడం లేదని బహిరంగంగానే చెప్తుండటం పట్ల సిగ్గు పడాలని నిప్పులు చెరిగారు.

**బాధ్యులపై చర్యలేవి?**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి పోయి కార్మికులు ప్రాణాలు కోల్పోతే ఇప్పటికీ బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని నల్లగొండ రైతుల తరఫున, ప్రజల తరఫున రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నానని కేటీఆర్ చెప్పారు. 'మీ కమీషన్ల కకుర్తితో ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోతే అందులో చికుకుపోయిన వారి శవాలను కూడా తీయలేకయింద్రు. కనీసం ఆ పనుల్లో ఏం జరిగిందో ప్రజలకు చెప్పే పరిస్థితి కూడా లేదు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటి వరకు అందుకు కారణమైన సంస్థపై విచారణ లేదు. చర్యలు లేవు' అని ఫైర్ అయ్యారు.

**కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపే కుట్రలు**

కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపే ప్రచారం చేస్తూ కుట్రలకు తెరలేపాయని, ప్రజలకు వాస్తవాలు తెలుసునని, దేశంలోని చట్టాల మీద, న్యాయవ్యవస్థ మీద తమకు సంపూర్ణ నమ్మకం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. 'మీరు ఎన్ని నోటీసులిచ్చినా, డ్రామాలు చేసినా ముమ్మాటికీ న్యాయం, ధర్మం గెలుస్తాయి. తెలంగాణకు మేలు చేసిన వారిని ఆ దేవుడే కాపాడుతాడు' అని స్పష్టం చేశారు. .'మీరు త్రీడీ మంత్రంగా భావిస్తున్న డిసెప్షన్, డిస్ట్రెక్షన్, డిస్ట్రాక్షన్ అనే మీ ఆలోచనలు ఎకువ రోజులు నడువవు.

కమిటీల పేరిట, కమీషన్ల పేరిట కాలయాపన చేస్తూ ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తూ 420 హామీల అమలును పట్టించుకోవడం లేదు. ఇచ్చిన ప్రతి అడ్డగోలు హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అని హెచ్చరించారు. ముమ్మాటికీ తెలంగాణ ప్రజలు తిరగబడి సాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కేటీఆర్ వెంట మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఒంటెద్దు నర్సింహారెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్న చిన్న కాంట్రాక్టర్లు సైతం ఏకంగా సచివాలయంలో ధర్నాకు దిగి మీ కమీషన్ల వ్యవహారాన్ని బట్టబయలు చేసింద్రు. చివరికి మీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం కమీషన్లు లేనిది, పైసలు లేనిది ఈ ప్రభుత్వంలో పనులు కావని బహిరంగంగానే చెప్తున్నరు. మీ కమీషన్ల వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కాళేశ్వరం కమిషన్ పేరిట డ్రామాలాడుతున్నరు.

**రెండేండ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు**
**కేటీఆర్‌కు మొర పెట్టుకున్న ఎంబీబీఎస్ విద్యార్థిని**

రెండేండ్ల నుంచి ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలేదని ఓ వైద్య విద్యార్థిని.. కేటీఆర్‌తో మొర పెట్టుకున్నది. బుధవారం నల్లగొండలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ వివాహానికి కేటీఆర్ హాజరయ్యారు. సమాచారం తెలుసుకున్న ఎంబీబీఎస్ విద్యార్థిని మేకల వర్షిణి కుటుంబ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. నల్లగొండకు చెందిన వర్షిణి సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నది. తన అక్క మేకల కౌశికి కూడా ఈ ఏడాది నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌తోపాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్నది. ఎస్సీ విభాగానికి చెందిన మెడికల్ విద్యార్థులకు నిబంధనల ప్రకారం ఏడాదికి రూ.60వేల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే నేరుగా కాలేజీలకు చెల్లించాల్సి ఉన్నది. గత రెండేండ్లకు సంబంధించిన రీయింబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించలేదు. ఇటీవల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న కౌశికి తన సర్టిఫికెట్లు తీసుకుందామని కాలేజీకి వెళ్తే ఫీజు పెండింగ్ ఉంది. అది క్లియర్ చేస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికిప్పుడు ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకునే స్థోమత లేని కౌశికి కుటుంబసభ్యులు కేటీఆర్‌కు తమ పరిస్థితిని వివరించారు. కేటీఆర్ స్పందిస్తూ౯% రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు.

# సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నాం

ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావు సహా 27 మంది నక్సల్స్‌ని భద్రతా బలగాలు హతమార్చాయి. సంఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆపరేషన్‌లో చాలా మంది మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారని అంచనా. ఎన్‌కౌంటర్‌లో డీఆర్‌జీ జవాన్ అమరుడయ్యాడు. ఈ ఆపరేషన్‌లో మరికొందరు జవాన్లు గాయపడ్డారు. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇక కీలక నేత సహా 27 మావోయిస్టులను మట్టుబెట్టడంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా భద్రతా బలగాలను ప్రశంసించారు.

సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నామన్నారు. మావోయిజం ముప్పును తొలగించేందుకు, ప్రజలకు శాంతియుత, ప్రగతిశీల జీవితాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని 'ఎక్స్' వేదికగా స్పందించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. నక్సల్స్



నిర్మూలన ఇదో మైలురాయి విజయమని పేర్కొన్నారు. సీపీఐ మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి, అగ్ర నేత, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సైతం ఉన్నారని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నేతను దళాలు మట్టుబెట్టడం ఇదే తొలిసారని సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా భద్రతా బలగాలను అభినందించారు. 2026 మార్చి 31లోగా నక్సలిజాన్ని అంతమొందిస్తామని షా స్పష్టం చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ స్పందిస్తూ.. మార్చి 2026 నాటికి దేశంలో, ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని అంతం చేయాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పాన్ని బలోపేతం చేస్తూ.. భద్రతా దళాలు నిరంతరం విజయం సాధిస్తున్నాయని.. లక్ష్యం వైపు వేగంగా కదులుతున్నాయని అన్నారు. క్లిష్ట భౌగోళిక పరిస్థితులు, అనేక సవాళ్లు ఉన్నప్పటికీ వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా ఈ నిర్ణయాత్మకంగా నారాయణపూర్‌లోని ఛత్తీస్‌గఢ్ పోలీసుల డీఆర్‌జీ యూనిట్ పూర్తి నిబద్ధత, దృఢ సంకల్పంతో పూర్తి చేస్తోందన్నారు. సైనికులు సాధించిన ఈ విజయం ప్రశంసనీయమని, వారి ధైర్యసాహసాలకు తాను సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఎన్‌కౌంటర్‌లో అమరుడైన జవాన్‌కు నివాళులర్పించారు. గాయపడ్డ వారంతా వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఢిల్లీ అతలాకుతలం

న్యూఢిల్లీ

భారీ తుపాను ధాటికి దేశ రాజధాని అతలాకుతలం అయ్యింది. బుధవారం సాయంత్రం నుంచి ధూళి, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు సమీపంలోని నోయిడా ప్రాంతాన్ని ఈ సాయంత్రం పెనుగాలులు, కుండపోత వర్షం ముంచెత్తాయి. అకాల వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడినప్పటికీ, ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించాయి. పలు ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈదురుగాలులు, భారీ వర్షంతో ఒక్కసారిగా ఢిల్లీలో వాతావరణం మారింది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో గంటకు 79 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో ఈ స్థాయిలో గాలుల వేగం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ తీవ్రతకు అనేక చోట్ల భారీ వృక్షాలు నేలకూలగా, పలు హోర్డింగ్‌లు విరిగిపడ్డాయి. లోధి రోడ్డు ప్రాంతంలో వడగళ్ల వాన కూడా కురిసింది. దీంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయాలు ఏర్పడ్డాయి. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, పెనుగాలులు మాత్రం తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఆకస్మిక వాతావరణ మార్పుల కారణంగా విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడింది. ఢిల్లీ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశారు. వాతావరణం అనుకూలించకపోవచ్చని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ వివరాల కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్ సంస్థలను సంప్రదించాలని ఎక్స్ వేదికగా తెలిపారు. ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి సంస్థలు కూడా తమ ప్రయాణికులకు ఇదే విధమైన సూచనలు చేశాయి. విమానాశ్రయానికి బయలుదేరే ముందు తమ విమాన స్థితిని తనిఖీ చేసుకోవాలని కోరాయి. ఢిల్లీ నుంచి శ్రీనగర్ వెళుతున్న ఇండిగో విమానం భారీ కుదుపులకు లోనైందని షేక్ సమీవుల్లా అనే ప్రయాణికుడు ఎక్స్ వేదికగా ఒక వీడియో పోస్ట్ చేశారు. విమానం గాల్లో ఉండగా సీట్లు తీవ్రంగా కదులుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. కెప్టెన్ చాకచక్యంగా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఢిల్లీతో పాటు హర్యానా, యూపీ రాష్ట్రాల్లోనూ పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఢిల్లీకి వర్షాలు ఉండడంతో.. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సోషల్ మీడియాలో తుపాను బీభత్సానికి సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

## సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులు ఇష్టపడరు

న్యూఢిల్లీ

సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులు ఇష్టపడరని, కానీ కేసుల పెండింగ్‌కు న్యాయవ్యవస్థ నింద భరించాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వేసవి సెలవుల అనంతరం తమ పిటిషన్‌ను లిస్టింగ్ చేయాలంటూ ఒక న్యాయవాది పట్టుబట్టడంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. మొదటి ఐదుగురు న్యాయమూర్తులు సెలవుల్లో కూడా కూర్చుని తమ విధులు కొనసాగిస్తున్నారని, అయినా పెండింగ్ కేసులపై న్యాయవ్యవస్థను తప్పుపడతారని, వాస్తవానికి సెలవుల్లో పనిచేయడానికి న్యాయవాదులే ఇష్టపడటం లేదని ధర్మాసనం పేర్కొంది. పాక్షిక న్యాయస్థాన పనిదినాల్లో రెండు నుంచి ఐదు వరకు వెకేషన్ బెంచ్‌లు పనిచేస్తున్నాయని, అందులో సీజేఐతో కూడిన ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులు కూడా విధి నిర్వహణలో ఉంటున్నారన్నారు. అంతకుముందు కేవలం రెండు బెంచ్‌లు మాత్రమే సెలవు దినాల్లో పనిచేసేవని, సీనియర్ జడ్జీలు వచ్చేవారు కారని ఆయన తెలిపారు.


## బలూచ్ బాంబ్ దాడిపై పాక్ ఆరోపణలు..
## తోసిపుచ్చిన భారత్

**న్యూఢిల్లీ:** బలూచిస్థాన్‌లో స్కూల్ బస్సుపై జరిగిన బాంబు దాడిలో ప్రమేయం ఉందన్న పాకిస్థాన్ ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. పాక్ సైన్యం నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నదని విమర్శించింది. ఉగ్రవాదానికి కేంద్రంగా పేరుగాంచిన పొరుగు దేశం అలాంటి వాదనలు చేయడం సాధారణమని పేర్కొంది. బలూచిస్థాన్‌లోని స్కూల్ బస్సుపై జరిగిన బాంబు దాడిలో నలుగురు విద్యార్థులు సహా ఆరుగురు మరణించారని, 12 మందికి పైగా గాయపడ్డారని బలూచిస్థాన్ సీఎం సర్ఫరాజ్ బుగ్టి మీడియాకు తెలిపారు. కాగా, ఈ దాడిలో భారత్ ప్రమేయం ఉందని పాకిస్థాన్ మిలిటరీ మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) ఆరోపించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ దీనిని తీవ్రంగా ఖండించారు. నిరాధారమైన ఆరోపణలని అన్నారు. 'ఉగ్రవాదానికి ప్రపంచ కేంద్రంగా ఉన్న దాని ఖ్యాతి నుంచి దృష్టిని మళ్లించడానికి, సొంత ఘోర వైఫల్యాలను దాచడానికి, పాకిస్థాన్ తన అంతర్గత సమస్యలన్నింటికీ భారత్‌ను నిందించడం ఆ దేశ స్వభావంగా మారింది' అని విమర్శించారు.

## యూపీఐ లావాదేవీలు
## ఇక మరింత సురక్షితం

దేశంలో మొబైల్ ఫోన్ల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలను అరికట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. టెలికాం శాఖ (డాట్) బుధవారం 'ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్' (ఎఫ్ఆర్ఐ) అనే నూతన వ్యవస్థను భాగస్వామ్య పక్షాలతో పంచుకోనున్నట్లు ప్రకటించింది. ఈ విశ్లేషణాత్మక సాధనం, సైబర్ మోసాల నివారణలో ఆర్థిక సంస్థలకు ముందుగానే కీలక సమాచారాన్ని అందించి అప్రమత్తం చేస్తుంది. డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ లో భాగంగా అభివృద్ధి చేసిన ఈ ఎఫ్ఆర్ఐ వ్యవస్థ, ఏదైనా మొబైల్ నంబర్‌కు డిజిటల్ పద్ధతిలో డబ్బు పంపేటప్పుడు ఆ నంబర్‌తో ముడిపడి ఉన్న ఆర్థిక మోసాల ప్రమాదాన్ని తెలియజేస్తుంది. దీనివల్ల సైబర్ రక్షణ మరింత పటిష్టమవడంతో పాటు, ధృవీకరణ ప్రక్రియలు మెరుగుపడతాయని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒక మొబైల్ నంబర్ ఆర్థిక మోసాలకు పాల్పడే అవకాశం ఎంత ఉందనేదాని ఆధారంగా దానికి 'మధ్యస్థం', 'అధికం' లేదా 'అత్యంత అధికం' అనే రిస్క్ కేటగిరీలను ఈ ఎఫ్ఆర్ఐ నిర్ధారిస్తుంది. దేశవ్యాప్తంగా 90 శాతానికి పైగా యూపీఐ లావాదేవీలు నిర్వహిస్తున్న ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే వంటి ప్రముఖ యూపీఐ వేదికలు ఇప్పటికే ఈ డీఐపీ హెచ్చరికలను తమ వ్యవస్థలలో అనుసంధానించుకునే ప్రక్రియను ప్రారంభించాయి. ఒక ప్రముఖ యూపీఐ సంస్థ, అనుమానిత లావాదేవీల విషయంలో కొంత జాప్యం చేస్తూ, వినియోగదారులకు హెచ్చరికలు పంపి, వారి అనుమతి తీసుకునే విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇతర బ్యాంకులు కూడా ఈ సమాచారాన్ని సైబర్ మోసాల నివారణకు చురుగ్గా వినియోగిస్తున్నాయని పేర్కొంది. దేశంలో యూపీఐ చెల్లింపులు అత్యంత ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో, ఈ కొత్త వ్యవస్థ లక్షలాది మంది పౌరులను సైబర్ మోసాల బారిన పడకుండా కాపాడగలదని భావిస్తున్నారు. అనుమానిత మోసాలపై టెలికాం, ఆర్థిక రంగాల్లో త్వరితగతిన, సమష్టిగా చర్యలు తీసుకోవడానికి ఎఫ్ఆర్ఐ వీలు కల్పిస్తుంది. సైబర్ నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు తేలిన, పునఃపరిశీలనలో విఫలమైన, నిర్దేశిత పరిమితులను మించిన మొబైల్ నంబర్ల జాబితాను టెలికాం శాఖకు చెందిన డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్ క్రమం తప్పకుండా సంబంధిత సంస్థలతో పంచుకుంటుంది. ఈ నంబర్లను కూడా సాధారణంగా ఆర్థిక మోసాలకు ఉపయోగిస్తుంటారు. ఏదైనా అనుమానిత మొబైల్ నంబర్‌ను గుర్తించిన వెంటనే, దానిపై విశ్లేషణ జరిపి, ఆర్థిక రిస్క్ స్థాయిని నిర్ధారించి, ఆ సమాచారాన్ని డీఐపీ ద్వారా అన్ని భాగస్వామ్య పక్షాలకు ఎఫ్ఆర్ఐ తక్షణమే తెలియజేస్తుంది. టెలికాం వనరుల దుర్వినియోగాన్ని నిరోధించడానికి, జాతీయ స్థాయిలో సాంకేతిక ఆధారిత పరిష్కారాలను అమలు చేయడానికి, భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయడానికి టెలికాం శాఖ కట్టుబడి ఉందని, తద్వారా పౌరులందరికీ సురక్షితమైన టెలికాం వాతావరణాన్ని కల్పిస్తామని డాట్ స్పష్టం చేసింది.

# వికసిత్ భారత్ యొక్క
## అమృత్ స్టేషన్లు



**ప్రారంభము**

భారతదేశం అంతటా **103** అమృత్ స్టేషన్లను పునరాభివృద్ధి చేశారు.

**3**

వీటితో కలుపుకొని

## తెలంగాణలో
### అమృత్ స్టేషన్లు



బేగంపేట్


వరంగల్



కరీంనగర్

**లాభాలు**

- రూఫ్ ప్లాజా, రిటైరింగ్ రూమ్, విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియా వంటి సౌకర్యాలతో స్టేషన్లను సిటీ సెంటర్లుగా అభివృద్ధి చేశారు.
- విరసత్ భీ వికాస్ భీ - స్థానిక వాస్తుశిల్పం నుండి ప్రేరణ పొందిన స్టేషన్ భవనాల నమూనాలు
- ప్రత్యేక ఎంట్రీ మరియు ఎగ్జిట్ గేట్లు, మెరుగైన పార్కింగ్, లిఫ్ట్, ఎస్కలేటర్, ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ ఏరియా, ట్రావెలేటర్ మరియు దివ్యాంగజన స్నేహపూర్వక సౌకర్యాల ఏర్పాటు.
- ఈ స్టేషన్లు మల్టీ-మోడల్ కనెక్టివిటీ ఇంటిగ్రేషన్ తో ఈ ప్రాంత సామాజిక-ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మారతాయి.
- పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి ఉపయోగించే శక్తి సామర్థ్యం మరియు పర్యావరణ అనుకూల చర్యలు

# నరేంద్ర మోదీ
## ప్రధానమంత్రి

చేత

(వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా)

**గురువారం 22 మే, 2025 ఉదయం 10:30 గంటలకు**

వీరి గౌరవ సమక్షంలో

**జిష్ణు దేవ్ వర్మ**
గవర్నర్, తెలంగాణ

**అనుముల రేవంత్ రెడ్డి**
ముఖ్యమంత్రి, తెలంగాణ

**అశ్విని వైష్ణవ్**
కేంద్ర రైల్వేలు, సమాచార & ప్రసారాలు మరియు ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక శాఖ మంత్రి

**అర్జున్ రామ్ మేఘవాల్**
కేంద్ర చట్టం & న్యాయం సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) మరియు పార్లమెంటరీ వ్యవహారాలు

ఇండియన్ రైల్వేస్

DD NEWS ఈ కార్యక్రమాన్ని DD న్యూస్లో ప్రత్యక్ష ప్రసారంలో చూడండి

www.indianrailways.gov.in

మమ్మల్ని ఫాలో అవ్వండి /RailMinIndia

# వై నాట్ పులివెందుల...

**కడప :** ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సొంత జిల్లా కడప గడపలో అడుగుపెట్టి తన సత్తా చాటిన టీడీపీ..ఇప్పుడు ఏకంగా తన నియోజకవర్గం పులివెందులలో అడుగుపెట్టి ఆ పార్టీ పునాదులు లేకుండా చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నారట. దీంతో కడప జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో ఇప్పుడు టీడీపీ రీసౌండ్ చేస్తుందన్న వార్తలు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిగ్గా మారాయి. ఎందుకంటే వైఎస్సార్ అంటే పులివెందుల, పులివెందుల అంటే వైఎస్సార్ అన్న పేరు నేటికీ అక్కడ కొనసాగుతోంది. కానీ తాజా పరిస్థితులు అందుకు భిన్నంగా మారుతున్నాయనే చర్చ జిల్లా రాజకీయాల్లో నడుస్తోంది. 4 దశాబ్దాలుగా వైఎస్ ఫ్యామిలీ కంట్రోల్ లో నడుస్తున్న పులివెందులలో ఇప్పుడు పరిస్థితి కాస్త చేంజ్ కనబడుతోంది.రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా పులివెందుల ప్రజలు మాత్రం వైఎస్ ఫ్యామిలీ వెంటే నడిచారు. వైఎస్ వివేకానంద రెడ్డి మొదలుకొని వైఎస్సార్, వైఎస్ జగన్, వైఎస్ అవినాష్ రెడ్డి కేవలం వైఎస్ ఫ్యామిలీని సపోర్ట్ చేస్తున్న జనం ఇప్పుడు ఒక్కసారిగా మార్పుకోసం చూస్తున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. వైఎస్ వివేకా మృతి తర్వాత పులివెందులలో చాలా మార్పులు వచ్చాయట. ఆయన మరణం తర్వాత వైసీపీ ఏపీలో అధికారాన్ని కోల్పోయిందివైఎస్ వివేక మరణం తర్వాత కడప జిల్లాలోనే కాదు..జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల ప్రజల్లో కూడా మార్పు మొదలైందట. మార్పు కావాలంటూ కోరుకుంటున్న జనం ఆ దిశగా అడుగులు వేస్తున్నారట. సరిగ్గా ఇదే అవకాశాన్ని అందిపుచ్చుకున్న కూటమి పులివెందులపై స్పెషల్ ఫోకస్ పెంచిందట. జగన్ సొంత ఇలాకాలో ఫ్యాన్ పార్టీని దెబ్బకొట్టి సైకిల్ పవర్ ఏంటో చూపించాలన్న ఆలోచనతో టీడీపీ అధినేత చంద్రబాబు



సరికొత్త పొలిటికల్ స్కెచ్ వేశారని సమాచారం. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన జగన్?టీడీపీ అధినేత చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో తన పవర్ చూపించాడు.ఇప్పుడు చంద్రబాబు కూడా అలాంటి మైండ్ గేమ్ నే మొదలుపెట్టి పులివెందులపై ఫోకస్ పెట్టారట. ఇప్పటికే పులివెందుల నుంచి ఎమ్మెల్సీని గెలిపించుకొని ఉపుమీదున్న పార్టీలోకి మరింత మంది లీడర్లను కడప వేదికగా ఆహ్వానించడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పులివెందుల మున్సిపాలిటీలో ఇద్దరు కౌన్సిలర్లు పార్టీ మారగా..మరికొంతమంది కూడా అదే దారిలో ఉన్నట్లు టాక్ విన్పిస్తోంది.మహానాడు వేదికగా పులివెందులలో వైఎస్ ఫ్యామిలీకి సన్నిహితులైన వారంతా ఇప్పుడు చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరబోతున్నారట. నలుగురు కౌన్సిలర్లు, ముగ్గురు ఎంపిటిసిలు, ఇద్దరు సర్పంచ్ లతో పాటు మరో ముఖ్య నేత సైకిలెక్కుతున్నట్టు పులివెందులలో సౌండ్ విన్పిస్తోంది. ఐతే వైసీపీ నేతలు చేజారిపోకుండా జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా..నేతలు మాత్రం పార్టీ మారేందుకే సిద్ధమయ్యారన్న చర్చ నడుస్తోంది.మహానాడు వేదికగా?పులివెందులలో వైసీపీని ఖాళీ చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు చక్రం తిప్పబోతున్నారన్న వార్త ఆపార్టీలో ఫుల్ జోష్ ను నింపుతోందట. ఇదే నిజమైతే పులివెందులలో కూడా వైసీపీకి ఎదురీత తప్పదా అన్న వార్తలు విన్పిస్తున్నాయి. అయితే చంద్రబాబు వేసే రాజకీయ వ్యూహాలను జగన్ ఎలా ఎదుర్కోబోతున్నారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారుతోంది. బాబు వేసే పొలిపటికల్ స్కెచ్ లకు ధీటుగా ఎలా అడుగులు ముందుకు వేయబోతున్నారనేది చూడాలి

# అందుబాటులోకి పురమిత్ర సేవలు
# గంటల్లో సమస్యలు పరిష్కారం

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్న రెండు పౌర ఫిర్యాదుల పరిష్కార వేదికల మధ్య పోటీతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతున్నాయి. ప్రధానంగా కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో పౌర సేవల కోసం మునిసిపల్ శాఖ కొద్ది నెలల క్రితం తెచ్చిన పురమిత్ర యాప్ గంటల్లో సమస్యలు పరిష్కరిస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో పౌర ఫిర్యాదుల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొద్ది నెలల క్రితం అందుబాటులోకి తెచ్చిన పురమిత్ర యాప్ ప్రజలకు నాణ్యమైన పౌర సేవల్ని అందించడంలో తోడ్పడుతోంది.పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఎవరికైనా కనీస అవసరాలు.. పట్టణ ప్రాంతాల్లో పన్నులు వసూలు చేసేందుకు ఉండే ఉత్సాహం పౌర సేవల విషయంలో ఉండదు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో మెరుగైన పౌర సేవల కోసం మొబలై? అప్లికేషన్‌ను పురపాలక శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది.పుర మిత్ర యాప్‌లో మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుంటే చాలు ఫిర్యాదిదారుడు ఎక్కడి నుంచైనా ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు. శానిటేషన్, పబ్లిక్ హెల్త్, తాగునీటి సరఫరా, టౌన్ ప్లానింగ్, పట్టణ పేదరిక నిర్మూలన, మునిసిపాలిటీల్లో పరిపాలనా వ్యవహారాలు, ఇంజనీరింగ్, స్ట్రీట్ లైటింగ్, రెవిన్యూ వంటి అంశాలపై నేరుగా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు.రాష్ట్రంలోని 95 మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 78 మున్సిపాలిటీలు ఉన్నాయి.పట్టణ ప్రజలు పౌర సేవల కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సి వచ్చేది. ఏ చిన్న అవసరం వచ్చినా మునిసిపల్ కార్యాలయాలను, సచివాలయాలను ఆశ్రయించాల్సి వచ్చేది.మున్సిపల్ కార్యాలయాలకు, గ్రామ సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరించేలా పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫిర్యాదును 12 నుంచి 24 గంటల వ్యవధిలోనే పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు.ప్రస్తుతం పురమిత్ర యాప్‌లో శానిటేషన్ అండ్ పబ్లిక్ హెల్త్ విభాగంలో 53రకాల సేవలు, తాగునీటి సరఫరాపై నాలుగు రకాల సేవలు, టౌన్ ప్లానింగ్ విభాగంలో 13 రకాల సేవలు, పట్టణ పేదరిక నిర్మూలనలో 12 రకాల సేవలు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సంబంధిత సేవల్లో 6 రకాలు, ఇంజనీరింగ్ విభాగంలో 16 రకాల సేవలు, స్ట్రీట్ లైట్స్ సమస్యలు 3 రకాలు, రెవిన్యూ సంబంధిత సేవల్లో 12 రకాల సేవల్ని అందుబాటులోకి తెచ్చారు. అన్ని విభాగాల్లో కలిపి 100కు పైగా పౌర సేవల్ని తక్షణమే అందించేలా ఏర్పాటు చేశారు.పురపాలికల్లో ప్రజా సమస్యలపై అధికార యంత్రాంగం తక్షణం స్పందించేలా ఇప్పటికే అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు ఫిర్యాదులు అందేలా ఏర్పాట్లు చేశారు. ప్రజలు ఫిర్యాదులు చేసేందుకు, నేరుగా ఫోటోలను అప్‌లోడ్ చేసేందుకు యాప్‌లోనే ఫోటోలు తీసేందుకు అవకాశం కల్పించారు. ఫిర్యాదులను టెక్ట్స్, వాయిస్ మెసేజీల రూపంలో పంపొచ్చు. సమస్య తీవ్రతను బట్టి తక్షణం స్పందించేలా అధికార యంత్రాంగానికి అవగాహన కల్పించారు."పుర మిత్ర" యాప్‌ను ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత దానిని మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. యాప్‌ను అన్ని వర్గాల ప్రజలు వినియోగించేలా సులువుగా అర్థమయ్యేలా డిజైన్ చేశారు.ఏపీలో పౌర సేవలపై ఫిర్యాదులను స్వీకరించేందుకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ అందుబాటులో ఉంది. పీజీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల్ని సమన్వయం చేస్తుంది. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడానికి వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.పీజీఆర్ఎస్‌తో పోలిస్తే పురమిత్ర అప్లికేషన్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరుగుతోంది. వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి ఫిర్యాదులను కార్పొరేషన్ల పరిధిలో గంటల వ్యవధిలోనే పరిష్కరిస్తోంది.గతంలో ప్రజా సమస్యలపై గ్రామ, వార్డుసచివాలయాలకు అనుబంధంగా పనిచేసిన వాలంటీర్ల దృష్టికి తీసుకు వెళితే వారి ద్వారా సచివాలయ సిబ్బంది మునిసిపల్ సేవల్ని అందించే వారు. ప్రస్తుతం ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా సమస్యను నమోదు చేస్తే వాటిని పరిష్కరించేలా మొబైల్ యాప్ పని చేస్తోందిపురపాలక శాఖ పురమిత్ర యాప్ ద్వారా అందిస్తున్న సేవలు ఇతర ప్రభుత్వ శాఖలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. రెవిన్యూ, సివిల్ సప్లైస్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, కమర్షియల్ టాక్సెస్ వంటి ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం ఏపీలో మెటా భాగస్వామ్యంతో వాట్సాప్‌లోనే పౌర సేవలు అందుతున్నాయి. ఫిర్యాదుల పరిష్కారానికి పీజీఆర్ఎస్‌ను వినియోగిస్తున్నారు.

## మత్తెక్కిస్తారు... మైమరిపిస్తారు..దోచేస్తారు..

**విజయవాడ :** అమ్మాయిలతో మాట్లాడాలంటే భయమా? వెంటనే మీ పిరికితనాన్ని పక్కనపెట్టేయండి.. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని.. మీకు నచ్చిన అమ్మాయిలతో చాటింగ్ చేసేయండి.. అంటూ.. మత్తుగా అందమైన అమ్మాయిలు మాటలు చెబుతారు. ఆ మాయమాటల వలలో పడి ఎందో విద్యార్థులు, ఉద్యోగులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు.మత్తెప్రేమగా మాటలు కలపుతారు. నెమ్మదిగా డేటింగ్‌కి పిలుస్తారు. చివరికి చీటింగ్ చేస్తారు. మోసాలే లక్ష్యంగా యాప్‌లోని మహిళలు, నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కొన్నిచోట్ల నిలువుదోపిడీకి గురై యువకులు బలవన్మరణానికి పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు, సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తులు, చదువుకునే విద్యార్థులే వీరి టార్గెట్.ఖాళీగా ఉన్నాం కదా... బోర్ కొడుతుందనో.. సరదాగా చాటింగ్‌కు దిగారా? ఇక అంతే సంగతులు. ఒక్కసారి వారి మాయలో పడితే.. రకరకాలుగా టార్చర్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. వైజాగ్‌కు చెందిన ఓ ఇంజనీర్‌కు డేటింగ్ యాప్‌లో ఓ మహిళ పరిచమైంది. తనది హైదరాబాద్ అని పరిచయం చేసుకుంది. ఆ తర్వాత ఇద్దరు వీడియో కాల్ వరకు వచ్చారు. అన్నింటినీ ఆమె తన ఫోన్లో రికార్డు చేసింది. ఇక బెదిరింపులకు దిగింది. బంధువులు, స్నేహితులను ట్యాగ్ చేసి సోషల్ మీడియాలో ఆ వీడియోలు పెడతానని బెదిరించి.. అతని నుంచి ఏకంగా రూ.28 లక్షలు వసూలు చేసింది.ప్రస్తుతం అనేక రకాల చాటింగ్, డేటింగ్ యాప్‌లు మార్కెట్లో ఉన్నాయి. మెసేజ్‌లకు నగదు చెల్లిస్తే.. కొంత సమయం వరకు అమ్మాయిలు చాటింగ్ చేస్తారు. సమయం అయిపోయిన తర్వాత అందులో డబ్బులు పెట్టి కాయిన్స్ కొనాల్సి ఉంటుంది. అలా కాయిన్స్ కొంటే.. మెసేజ్ చాటింగ్, వీడియో చాటింగ్ ఇలా వివిధ రకాలుగా ఆప్షన్స్ వస్తాయి. ఇక్కడి నుంచి డబ్బులు కాజేయడం ప్రారంభమవుతుంది. యాప్ నిర్వాహకులు అమ్మాయిలను నియమించుకొని.. జీతం తోపాటు వారికి కస్టమర్ నుంచి వచ్చిన డబ్బులో కమిషన్ కూడా ఇస్తున్నారు. ఇలా పెద్దఎత్తున చాటింగ్, డేటింగ్ పేరుతో మాఫియా నడుపుతున్నారు.యాప్‌లో వీడియో కాల్ చేయాలని యువతులు, మహిళలు రెచ్చగొడతారు. వారు చెప్పినట్లు చేసిన అనేక మంది ఉద్యోగులు, విద్యార్థులు జీవితం నాశనం చేసుకున్నారు. గతేడాది కృష్ణా జిల్లాకు చెందిన ఓ ఎంపీడీవో.. ఇలానే ఓ వీడియో చాట్ చేశారు. దాన్ని రికార్డు చేసుకున్న ఆ మహిళ.. ఎంపీడీవోను బెదిరించింది. రూ.20 లక్షల వరకు వసూలు చేసింది. అయినా వదిలిపెట్టలేదు. వీడియోలు ఉన్నతాధికారులకు పంపుతానని బెదిరింపులకు పాల్పడగా.. చివరికి ఆ ఎంపీడీవో ఆత్మహత్య చేసుకున్నారు.పని ఒత్తిడిలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వర్క్ ఫ్రం హోం చేసేవారు, విద్యార్థులు.. 22 నుంచి 35 ఏళ్ల వయసున్నవారే వీరి లక్ష్యం. ఒంటరిగా ఫీలవుతున్నారా? లైఫ్‌లో ఎంజాయ్‌మెంట్ కోరుకుంటున్నారా.. అంటూ తమవైపు లాగుతారు.

## యోగాకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. యోగా దినోత్సవాన్ని ప్రధాని మోదీ ఒక దీక్ష , పట్టుదలతో చేస్తున్నారన్నారు. నేటి (బుధవారం) నుంచి నెల రోజుల పాటు యోగాంధ్ర -2025పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. 5 లక్షల మందితో వచ్చే నెల 21 తేదీన యోగా డే నిర్వహిస్తామని.. ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో యోగ డే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 10 లక్షల మందికి యోగా సర్టిఫికెట్ ఇస్తామన్నారు. యోగా వల్ల తనకు మానసిక ప్రశాంత ఏర్పడిందని ముఖ్యమంత్రి అన్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు యోగాను ప్రమోట్ చేస్తున్నాయని తెలిపారు. 27 జిల్లాలో నెల రోజులపాటు యోగాంధ్ర పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మీడియా సైతం యోగాను ప్రమోట్ చేసేందుకు కృషి చేయాలని కోరారు. 2,500 మందిని మాస్టర్ ట్రైనర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కాగా.. విజయవాడ హరిత బెరంపార్కులో యోగాంధ్ర జనజాగృతి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజులపాటు యోగాంధ్ర ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా అవగాహన, శిక్షణ ఇవ్వనున్నారు. నిపుణులు రూపొందించిన యోగా కామన్ ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ, అభ్యాసం చేస్తారు. యోగాలో శిక్షణ పొందిన కనీసం 20 లక్షల మందికి సర్టిఫికెట్ల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జూన్ 21న విశాఖ ఆర్‌కే బీచ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డు స్థాయిలో ప్రజలకు యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని.. ప్రతిఒక్కరూ తమ జీవన మార్గంలో యోగా అభ్యసనాన్ని భాగం చేసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం) ఎంటీ కృష్ణబాబు తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, యోగా ఔత్సాహికులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్యకర్తల బాధ్యత తీసుకుంటా..
## ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటా: లోకేశ్

-మొదటిపేజీ తరువాయి

నివసిస్తున్న ఇల్లు తాకట్టులో ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. ఆర్థికంగా ఆదుకుంటానని, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ ధైర్యం చెప్పారు. ఇకపై కార్యకర్తలను నేరుగా కలుసుకోవాలని నిర్ణయించారు.

## రేషన్... పరేషాన్..

**ఒంగోలు :** ఏపీలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు మరో 10 రోజుల్లో ముగియనుంది. దరఖాస్తుదారులకు మ్యారేజ్ సర్టిఫికేట్ సమస్య వెంటాడుతోంది. కార్డుల్లో సభ్యుల జోడింపు లేదా తొలగింపు, మార్పుచేర్పులకు వివాహ ధ్రువపత్రాలు అప్లోడ్ అడుగుతోందని సిబ్బంది అంటున్నారుఆంధ్రప్రదేశ్ లో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు, రేషన్ కార్డుల్లో మార్పుచేర్పులకు అవకాశం కల్పించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే దరఖాస్తుల్లో కొత్త చిక్కులు వస్తున్నాయి. ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తుల్లో 80 శాతం బియ్యం కార్డుల్లో పేర్ల తొలగిపు లేదా జోడింపు వంటి సమస్యలే ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది.రైస్ కార్డుల్లో పేర్ల తొలగింపు లేదా జోడింపునకు పత్రాల చిక్కొచ్చిపడింది. స్వయంగా మంత్రి, ఉన్నతాధికారులు మ్యారేజ్ సర్టిఫికేట్ అవసరంలేదని చెబుతున్నా.. దరఖాస్తు సమయంలో మాత్రం అవి కావాల్సిందేనని సిబ్బంది అంటున్నారు. మరణించిన వారి పేర్లు మినహా ఇతరుల పేర్లు రైస్ కార్డుల నుంచి తొలగించే అవకాశం లేదని సిబ్బంది అంటున్నారు.ఈ నెల 7న ప్రారంభమైన ప్రక్రియలో ఇప్పటి వరకూ 3,48,399 దరఖాస్తులు అందాయి. వీటిలో 75 శాతం అప్లికేషన్లు కుటుంబ సభ్యులను కార్డుల్లో చేర్చుకునే ప్రక్రియలో వచ్చినవే. దీనికీ ఈకేవైసీ, సర్వర్ సమస్యలు వెంటాడుతున్నాయి.గ్రామాల్లో చాలా మందికి పెళ్లి ధ్రువీకరణ పత్రాలు ఉండవు. కొత్తగా పెళ్లైన వారు రైస్ కార్డులో కుటుంబసభ్యుడి పేరు చేర్చుకునేందుకు మ్యారేజ్ సర్టిఫికేట్ కావాలని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో వీరంతా ఇప్పుడు కొత్తగా పెళ్లికార్డులు ప్రింట్ చేయించుకుంటున్నారు.సాధారణంగా పెళ్లైన 60 రోజుల్లోగా గ్రామ, వార్డు సచివాలయంలో పెళ్లి సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ గడువు దాటిపోతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరగాలి. ఇప్పుడు పెళ్లి సర్టిఫికేట్ లింక్ పెట్టడంతో...సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు పరుగులు పెడుతున్నారు. సర్టిఫికేట్ వచ్చేలాగా దరఖాస్తు గడువు ముగుస్తుందనే ఆందోళన దరఖాస్తుదారుల్లో మొదలైంది.వివాహ ధ్రువపత్రాలు అవసరం లేదని, మ్యారేజ్ రిజిస్ట్రేషన్ నంబరు, ఫొటో ఇస్తే దరఖాస్తు అప్లోడ్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే మ్యారేజీ సర్టిఫికేట్ అప్లోడ్ చేస్తేనే ప్రాసెస్ ముందుకు వెళ్తుందని సచివాలయ సిబ్బంది అంటున్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయకపోవడంతో ఈ సమస్య వస్తుందని చెబుతున్నారు.హౌస్ హోల్డ్ డేటా ఎనేబుల్ చేయకపోవడంతో సమస్యలు వస్తు?న్నాయని సచివాలయ సిబ్బంది అంటున్నారు. ఒకే తెల్ల రేషన్ కార్డుపై...రెండు రైస్ కార్డులు ఉంటున్నాయి. కుటుంబ సభ్యులంతా ఒకే మ్యాపింగ్ కింద ఉంటున్నారు. కుటుంబ విభజన అవకాశం లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.హౌస్ హోల్డ్ డేటా విభజనకు కూడా ఎనేబుల్ చేయాలని కోరుతున్నా...అధికారులు పట్టించుకోవడం లేదని దరఖాస్తుదారులు అంటున్నారు.బియ్యం కార్డుల దరఖాస్తుదారులను సర్వర్ ముప్పుతిప్పలు పెడుతోంది. ఉదయం వచ్చిన వారిని సాయంత్రం వరకూ సచివాలయాల్లో కూర్చోబెడుతోంది. సర్వర్లు సరిగ్గా పనిచేయడంలేదని, పనిచేసిన కాసేపు ఏదో సమస్యలు వస్తున్నాయంటున్నారు.మొబైల్ ద్వారా ఈకేవైసీ చేయాలన్నా, సర్వర్ సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. మరో 10 రోజుల్లో రేషన్ కార్డుల దరఖాస్తులు ముగుస్తాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

## బెంగళూరుకు వందే భారత్ ట్రైన్...

**తిరుపతి :** విజయవాడ - బెంగుళూరు మధ్య త్వరలో వందే భారత్ రైలు పరుగులు తీయనుంది. ఇప్పటికే పాలనాపరమైన అనుమతులు లభించగా, ట్రైన్ సర్వీస్ ప్రారంభించడంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. విజయవాడ నుంచి తిరుపతి మీదుగా 9గంటల్లోనే బెంగుళూరు చేరుకునేలా ప్రయాణ సమయాన్ని ఖరారు చేశారు.విజయవాడ బెంగుళూరు మధ్య వందే భారత్ సర్వీస్ త్వరలో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం హైదరాబాద్-విశాఖపట్నం మధ్య విజయవాడ మీదుగా రెండు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. త్వరలోనే విజయవాడ నుంచి బెంగుళూరుకు మరో సర్వీసును ప్రారంభించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది.విజయ వాడ-బెంగళూరు మధ్య వందే భారత్ ఎక్స్ ప్రెస్ పట్టాలెక్కనుంది. విజయవాడ నుంచి బెంగుళూరు వైపు పరిమిత సంఖ్యలో రైళు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.విజయవాడ నుంచి ప్రస్తుతం యశ్వంతపూర్ రైలు మాత్రమే బెంగుళూరుకు ఉంది. దీంతో ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఫుల్ ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. ఈ మార్గంలో కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలని చాలా కాలంగా డిమాండ్ ఉంది. కొత్త రైలును తిరుపతి మీదగా బెంగుళూరుకు నడుపుతారు.వందేభారత్ సిరీస్ రైళ్లు మొదలైన తర్వాత విజయవాడ- బెంగుళూరు మధ్య కొత్త రైలును ప్రారంభించాలని స్థానిక ప్రజల నుంచి డిమాండ్ వచ్చింది. తొలి దశలో సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య మొదటి రైలు ప్రారంభమైంది. ఆ తర్వాత విశాఖ నుంచి హైదరాబాద్‌కు మరో వందే భారత్ ప్రారంభించారు. రెండు రైళ్లు ఏకకాలంలో విశాఖపట్నం, సికింద్రాబాద్ నుంచి గమ్య స్థానాలకు బయల్దేరుతున్నాయి.ఇకపై బెంగుళూరుకు వందే భారత్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విజయవాడ నుంచి బెంగుళూరుకు ప్రస్తుతం ప్రయాణ సమయం 12 గంటలకు పైగా పడుతోంది. వందే భారత్ రైలు అందుబాటులోకి వస్తే తొమ్మిది గంటల్లోనే గమ్య స్థానాన్ని చేరుకోవచ్చు. దాదాపు మూడు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది.వందే భారత్ రైలుతో బెంగళూరు వెళ్లే వారితో పాటు తిరుపతి వెళ్లే భక్తులకు కూడా అనువుగా ఉంటుంది. మొత్తం 8 బోగీల్లో 7 ఏసీ చైర్ కార్ బోగీలు, ఒక ఎగ్జిక్యూటివ్ చైర్ కార్‌తో ఈ సర్వీస్ నడుపుతారు. వారంలో మంగ ళవారం మినహా ఆరు రోజులు నడిచేలా షెడ్యూల్ ఖరారు చేశారు.ట్రైన్ నంబర్ 20711 విజయవాడ-బెంగుళూరు వందే భారత్ విజయవాడలో ఉదయం 5.15 బయలుదేరి తెనాలి 5.39కు

# అనాధలకు అన్నదానం ఆత్మ సంతృప్తినిచ్చింది : భీమారావు





**దివ్యాంగులకు అన్నదానం**

**మాల మహానాడు మండల గౌరవ అధ్యక్షుడు భీమారావు తండ్రి అప్పులు ఘనంగా వర్ధంతి వేడుక**

**దివ్యాంగులను కుటుంబ సభ్యులుగా తలంచి వారి మధ్య వేడుక**

**పాలకొల్లు, మే-21, ప్రజాజ్యోతి, (జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ) న్యూస్:** వేడుక ఏదైనా అనాధలు, దివ్యాంగులకు కడుపునిండా అన్నం పెట్టి సంతృప్తి పొందాలనుకునేవారు అరుదు. ఇటువంటి కార్యక్రమం ఆదర్శం. ఈ రీతిగా అనాధలను ఆదరించడం.. వీరిని ఆదరించే పునరావాస కేంద్రానికి సహకారంగా నిలవడం శుభ పరిణామం. అనాధలు, దివ్యాంగులే నా కుటుంబ సభ్యులుగా తలంచి వారి మధ్య వేడుకను జరుపుకోవడమే మంచిది అని మాల మహానాడు పోడూరు మండల గౌరవ అధ్యక్షుడు బుడితి భీమారావు కార్యచరణ చేశారు . భీమారావు తండ్రి బుడితి అప్పులు నూరేళ్ళ జీవించి మృతి చెందారు. ఆయన ద్వితీయ వర్ధంతి వేడుకలను పాలకొల్లు పరిధిలోని హనుమాన్ నగర్ కు చెందిన అంజలి మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో బుధవారం ఉదయం, సాయంత్రం అన్నదానం వితరణ చేసి వారితో గడిపారు. భీమారావు మాట్లాడుతూ మా తండ్రి అంటే నాకు ఎంతో ఇష్టమని అన్నారు. దేవుని వద్దకు చేరిన తన తండ్రి ఆత్మ అభం శుభం ఎరుగని దేవుని దేవుని పిల్లలతో కలసి ద్వితీయ వర్ధంతిని వీరి మధ్య జరుపుకోవడం ఎంతో ఆత్మ సంతృప్తిని కలుగ చేసిందన్నారు. వీరితో గడిపిన ఈ కొద్దిగంటలు నా జీవితంలో మరుపురాని సంఘటన అన్నారు. ఈ వేడుక ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ప్రత్యేక అనుభూతిని కలగ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తరపట్ల మోహనురావు, యువజన సంఘం కోశాధికారి సరేళ్ళ సత్యనారాయణ, సభ్యులు,మాక వెంకటేశ్వరరావు,వరిగేటి ప్రసాద్,ఈధ రత్నారాజు,మంద్రు క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో తెలుగు దేశం పార్టీ జిల్లా మినీ మహానాడు



**మే 21,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** మే 22న చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి పార్లమెంట్ జిల్లా స్థాయి మహానాడు సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి.., బుధవారం చిత్తూరు జిల్లా టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సి.ఆర్ రాజన్, టీడీపీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు..,,చూడా ఛైర్పర్సన్ కఠారి హేమలత.., జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చిట్టి బాబు నాయుడు, పార్టీ కార్యాలయం కార్యదర్శి మోహన్ రాజ్.., పార్టీ సీనియర్ నేతలు చంద్ర ప్రకాష్ తదితరులు సమావేశమై.., మహానాడు నిర్వహణ పై చర్చించారు. అదే సమయంలో కడప వేదికగా జరుగనున్న మహానాడు మహాసభలను విజయవంతం చేసే అంశాల పై సుదీర్ఘంగా సమీక్షించారు. చిత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగే మహానాడులో తీసుకున్న నిర్ణయాలు.., తీర్మానాలను తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి నివేదించే విషయాన్ని కూడా ఈ సందర్భంగా చర్చించుకున్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంగా పనిచేసి చిత్తూరు టిడిపి కార్యాలయంలో తలపెట్టిన పార్లమెంటు స్థాయి మహానాడు సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో కడపలో జరిగే మహానాడును కూడా విజయవంతం చేయడంలో చిత్తూరు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కీలక భూమిక పోషించాలని నిర్ణయించారు.

# యస్వీయూలో "యోగాంధ్ర-2025" ప్రచార బ్రోచర్ ఆవిష్కరణ




**మే21,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న "యోగాంధ్ర-2025" ప్రచారానికి మద్దతుగా , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తో చేతులు కలిపి విశ్వవిద్యాలయ అధికారులు బ్రోచర్ను విడుదల చేశారు. 2025 జూన్ 21న విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందు సామూహిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం రూపొందించారు.ఈ బ్రోచర్ను మధ్యాహ్నం 12.30 గంటలకు ఉపకులపతి ఆచార్య సిహెచ్. అప్పారావు ఛాంబర్లో విశ్వవిద్యాలయ అధికారులు , అధ్యాపకుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ' యోగా అనేది శారీరక వ్యాయామం కంటే ఎక్కువ - ఇది అంతర్గత సమతుల్యత, మానసిక దృఢత్వం,సమగ్ర శ్రేయస్సుకు మార్గం. ఆరోగ్యకరమైన , మేధోసమాజాన్ని నిర్మించాలనే ప్రభుత్వ దార్శనికతకు మద్దతు ఇవ్వడం మనకు గర్వకారణం" అని వ్యాఖ్యానించారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ మానసిక , శారీరక ఆరోగ్యం అవసరమని, విశ్వవిద్యాలయం సమాజంలో ఇటువంటి పద్ధతులను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందని అన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2025 మే 22 నుండి జూన్ 21 వరకు "యోగా మాసం" జరుపుకుంటుందవి, ఈ సమయంలో రోజువారీ యోగా సెషన్లు ఉదయం 8:20 నుండి ఉదయం 9 గంటల వరకు అడ్మినిస్ట్రేటివ్ భవనం ముందువుంటాయని, బోధన,బోధనేతర సిబ్బందికి పాల్గొంటారని ,శిక్షణ పొందిన యోగా బోధకుల మార్గదర్శకత్వంలో నిర్వహించబడే ఈ సెషన్లు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మానోప్రశాంతతను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూసా సిఇఓ వంశీ రాయల్ బీ డీన్ ఆచార్య ఎన్. చంద్రాయుడుబీ ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య టి. దామోదరంబీ పరీక్షల డీన్ ఆచార్య ఎస్. కిషోర్బీ అసిస్టెంట్ ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ యాదవ్బీకల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. వివేక్ పాల్గొన్నారు.

# పోలవరంలో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుక



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ మే 21** 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర-2025 కార్యక్రమం లో భాగంగా పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మరియు పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు యోగ కార్యక్రమాలు జరిగిందని పోలవరం ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఏపీ ట్రాకర్ చైర్మన్ ఎంపీడీవో మాట్లాడుతూ యోగా మెరుగైన జీవనానికి దోహద పడుతుందని తెలిపారు. నేడు ప్రపంచంలో అన్ని దేశాల్లో జరుపుకునే కార్యక్రమం యోగా అని అన్నారు. యోగా అనేది కొద్దిమందికో లేక.. కొన్ని ప్రాంతాలకు సంబంధించింది కాదన్నారు.అందరి జీవితాల్లో యోగా అనే ఒక భాగం కావాలని సూచించారు. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరం యోగా అని చెప్పుకొచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, మండల పరిషత్ సిబ్బంది, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ సిబ్బంది, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, సచివాలయం మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్దిగరువు గ్రామానికి ఐదు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి మంచినీటి సదుపాయం ఏర్పాటు

సూపర్ సర్పంచ్ నాగులు



**అనంతగిరి.మే 21. ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్ శంకర్.** మండలంలో అనంతగిరి గ్రామపంచాయతీ పరిధి మద్దిగరువు గ్రామానికి 2022. 23. సంవత్సరంలో 15వ.ఆర్థిక సంఘం నిధులునిధు లు ఐదు లక్షలు రూపాయ లు ఖర్చుపెట్టి గ్రామానికి మంచినీటి సదుపాయం కల్పించడం జరిగిందని అనంతగిరి గ్రామపంచాయతీ సూపర్ సర్పంచ్ నాగులు బుధవారం నాడు ప్రజా జ్యోతి కి కలిసి వివరించారు. మద్దిగరువుగ్రామానికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తి గ్రామానికి ఎటువంటి మంచినీటి సదుపాయం లేదని. పత్రిక ప్రకటన చేయడం అవాస్తమని నాగులు అన్నారు. 4.లక్షల రూపాయలు ఖర్చుపెట్టి మంచినీటి బావి ఏర్పాటు జరిగిందని. లక్ష రూపాయలు ఖర్చుపెట్టి మంచినీటి పైపులు ఇంటింటికి మంచినీటి కనెక్షన్లు పంచాయతీ ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదపడుతుంది.

జిన్నూరు శాఖా గ్రంథాలయంలో యోగాసనాలపై విద్యార్థులకు అవగాహన.




**పాలకొల్లు ప్రజా జ్యోతి (కొట్టి రామం) మే 21 :** సంపూర్ణ ఆరోగ్యానికి యోగ దోహదపడుతుందని ప్రతి ఒక్కరూ యోగ సాధన చేసి ఆరోగ్యకరమైన జీవితాన్ని సాగించాలని జిన్నూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు డి దుర్గా నాగమల్లేశ్వరి అన్నారు.ఈనెల 21 నుండి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని పురస్కరించుకుని పోడూరు మండలం జిన్నూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఆమె యోగాసనంలోని పలు అంశాలను విద్యార్థులకు వివరించి విద్యార్థుల చేత పలు ఆసనాలు సాధన చేయించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరి మాట్లాడుతూ నిరంతర యోగ ప్రక్రియ వలన శారీరక మానసిక ఆరోగ్యం కలిగి ఉండడమే కాకుండా మానసిక ఒత్తిడికి ఆందోళనకుదూరంగా ఉండగలుగతారన్నారు.ఈ సందర్బంగా యోగా పట్ల అవగాహనకు మెయిన్ రోడ్ లో విద్యార్థుల తో ర్యాలీ జరిపారు. గ్రంథాలయాధికారి బత్తుల జోగారత్నం, వాలంటీరు బండారు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్...

168.55 గ్రాములు బంగారు ,192.5 గ్రాములు వెండి స్వాధీనం

కర్ణాటక రాష్ట్రంలో పలికేసులలో ముద్దాయి



**మే 21,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** పలు కేసులలో ముద్దాయిగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లుగా చంద్రగిరి సబ్ డివిజన్ డిఎస్పి ప్రసాద్ అన్నారు. ఈ నేపథ్యంలో తిరుచానూరు పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన ఈ.కుమార్ రాజ అనే అతని ఇంటిలో దొంగతనం జరిగింది. అతని వద్ద నుండి అందిన ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.ఈ క్రమంలో తిరుపతి జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు ఉత్తర్వుల మేరకు, తిరుపతి క్రైమ్ అదనపు ఎస్.పి. నాగభూషణం రావు పర్యవేక్షణలో చంద్రగిరి సబ్ డివిజన్ డిఎస్పి బి.ప్రసాద్ ఆధ్వర్యంలో తిరుచానూరు పోలీసులు నేరస్థుల కోసం వివిధ బృందాలుగా ఏర్పడి, వెతుకుతూ ఉండగా తిరుపతి రూరల్ మండలం, ముండ్లపూడి క్రాస్ వద్ద కర్ణాటక రాష్ట్రం, బెంగళూరు, హొసకెర హళ్లి, బనసంకరి 3%తీస% స్టేజి, వీరభద్ర నగర్ కి చెందిన అంతర్ రాష్ట్ర దొంగ అయిన వీ. నాగరాజు ఏ వాసు ను అరెస్టు చేసి 168.55 గ్రాములు బంగారు ,192.5 గ్రాములు వెండి స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు.కాగా నిరుడి పై కర్నాటక రాష్ట్ర కాగలిపూరా, గిరినగర్, రాజేశ్వరి నగర్, హనుమంత నగర్, సికె అచ్చికట్టు పోలీస్ స్టేషన్ నందు డెకాయిట్, రాబరీ, రాత్రి దొంగతనములు, మోటార్ సైకిల్ దొంగతనములు లాంటి కేసులు కలవు అని అన్నారు. ఈ కేసులో కృషి చేసిన సిఐ బి.సునీల్ కుమార్, ఎస్.ఐ. లు ఏం.అరుణ, టీ. సాయినాథ్ చౌదరి, ఈ. జగన్నాధ రెడ్డి, క్రైమ్ పార్టీ సిబ్బందిని హర్షవర్ధన్ రాజు అభినందించారు.

## శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థి రేవతిని వరించిన డాక్టరేట్.



**మే21,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగంలో "ఏ స్టడీ టు అసిస్ ద సైకలాజికల్ హెల్త్ హజార్డ్స్ అమాంగ్ ఫిమేల్ స్టాఫ్ నర్సెస్ ఇన్ కేరళ" అనే అంశం పైన ప్రో.జయశ్రీ (రిటైర్డ్)పర్యవేక్షణలో మరియు డా. నీరజ సహ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినందుకు గాను ఎన్.ఆర్. ఐ కాండిడేట్ శ్రీమతి రేవతి కి డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా అధ్యయన విభాగం మరియు సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ రేవతి కి అభినందనలు తెలియజేశారు.

## తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**మే 21,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** తుడా చైర్మన్ గా నియమితులైన డాలర్ దివాకర్ రెడ్డికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గం, పెరుమాళ్ళపల్లెకు చెందిన డాలర్ దివాకర్ రెడ్డిని తుడా చైర్మన్ గా నియమిస్తూ... ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో బుధవారం తుడా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన డాలర్ దివాకర్ రెడ్డిని..,, ఆయన సొంతూరు పెరుమాళ్ళ పల్లెల్లోని డాలర్ నివాసంలో పుష్పగుచ్చాలందించి.., అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

# తెలుగువాడి ఆత్మ గౌరవానికి ప్రతీక టిడిపి

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే కూటమి లక్ష్యం : కేంద్రమంత్రి కింజరాపు
పేద ప్రజల అభ్యున్నతి కృషి చేసిన పార్టీ టీడీపి
పార్టీ లక్ష్యాలను , ఆదర్శాలను ప్రజల్లోకి తీసుకువెల్లడమే ఉద్దేశ్యం
ఆమదాలవలసలో మినీ మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్





**ఆమదాలవలస , ప్రజా జ్యోతి న్యూస్ :** తెలుగువాడి ఆత్మ గౌరవానికి ప్రతీక టిడిపి అని కేంద్రమంత్రి కింజ రాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆమదాలవలస నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే , రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ ఆధ్వర్యంలో మిని మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ సూర్యుడి పై మబ్బులు కమ్మిన్నట్లు గత ఐదేళ్ల వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రం విచ్చిన్నమై అప్పుల ఊబిలోకి వెల్లిందన్నారు. వైకాపా అధికారం లో ఉన్న సమయంలో ఎటువంటి అభివృద్ధి లేకపోవడంతో రాష్ట్రం 25 ఏళ్ళు వెనక్కి వెళ్ళిందన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని మళ్ళీ గాడిలో పెట్టేందుకు అనుభవంతమైన నాయకుడు అవసరమని ప్రజలు నమ్మి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర సర్వతోముఖ అభివృద్దే కూటమి ధ్యేయమని ,ఆమదాలవలస లో సాగునీటి ,త్రాగునీటి కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయంటే అవి కేవలం తెలుగుదేశం ప్రభుత్వం హయంలో ప్రారంభించినవే అని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించే పార్టీ



తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ యొక్క గొప్ప సంప్రదాయంలో భాగమైన మహానాడు నిర్వహించే ముందుగా మినీ మహానాడు ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు.పార్టీ యొక్క లక్ష్యాలను , ఆదర్శాలను ప్రజల్లోకి మరింత ఉత్తేజంతో తీసుకెళ్లేందుకు మహానాడు, మినీ మహానాడు ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం స్వర్గీయ ఎన్టీఆర్ కు సంబందించిన శ్రీ నందమూరి శతకం పుస్తకాన్ని కేంద్ర మంత్రి తో కలిసి కూన రవికుమార్ ఆవిష్కరించారు. వీటితో పాటు ఆపరేషన్ సిందూర్ లో భాగంగా ఇండియా పాక్ సరిహద్దులో శత్రుమూకలతో పోరాడి తన ప్రాణాలను అర్పించిన మురళీ నాయక్ కు ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మోనం పాటించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వ ప్రసాద్, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యం , మార్క్ఫెడ్ స్టేట్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ, కలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ , స్టేట్ అబ్జర్వర్ టీ చంద్రశేఖర యాదవ్ , నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లీ , మండల అధ్యక్షులు నూకరాజు , ఎక్స్ చైర్ పర్సన్ గీత విద్యాసాగర్ , టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొదలవలస రమేష్ , మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు సంపద రావు మురళి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, బూర్జ మండల అధ్యక్షుడు రాంజీ , సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు అంబాల్ల రాంబాబు , పొందూరు మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ , తెలుగు జిల్లా మహిళ అధ్యక్షురాలు తమ్మినేని సుజాత గారు,పొందూరు మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ , జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు , పొందూరు మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , ఎ.ఎం.సి మాజీ చైర్మన్ అన్నెపు రాము ,, చింతాడ వాసు దేవ రావు ,జిల్లా, నియోజకవర్గ పరిధిలో అన్ని హెూదాల్లో ఉన్న ముఖ్య నాయకులు, అన్ని క్లస్టర్, యూనిట్,బూత్ ఇన్చార్జిలు, బూత్ ఏజెంట్లు , తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు మహిళలు యువత ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటింటికీ రేషన్ పథకాన్ని కొనసాగించాలి

ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచిన రేషన్ పథకం
వాహనాల రద్దుతో రోడ్డున పడుతున్న వేల కుటుంబాలు
ప్రజల జీవన ఉపాధుల పై కక్ష సాధింపులు తగదు
మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఉద్యోగాలను పీకేస్తున్న చంద్రబాబు
ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు తప్పని ఇక్కట్లు
వైఎస్సార్సీపీ కళింగ కార్పోరేషన్ మాజీ చైర్మన్ రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు

**శ్రీకాకుళం ,ప్రజా జ్యోతి న్యూస్ :** ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతో గత వైకాపా ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన ఇంటింటికీ రేషన్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని వైఎస్సార్సీపీ కళింగ కార్పోరేషన్ మాజీ చైర్మన్ రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు ( లక్ష్మణ రావు ) అన్నారు. బుధవారం నాడు శ్రీకాకుళం లో తన కార్యాలయం వద్ద పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ పంపిణీ పంపిణీ కూటమి ప్రభుత్వం రద్దు చేస్తూ ,నిరుపేదల నోటి కాడ కూడు లాగేయడం అన్యాయమని అన్నారు. రేషన్ దుకాణాల వద్ద జరుగుతున్న అవినీతి , అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నాడు జగన్మోహన్ రెడ్డి హయంలో ఇంటింటికీ నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఇంటి వద్దకే లబ్దిదారులు నాణ్యమైన బియ్యాన్ని పొందారన్నారు. వృద్ధులు ,వికలాంగులు ,ఇతరులు రేషన్ దుకాణాల వద్ద ఇబ్బందులు పడకుండా వారి శ్రమను తగ్గించి ,ప్రతీ నెలా ఇంటి వద్దకే సకాలంలో సరుకులను అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రేషన్ డిపో ల నుండి ఇంటికి రేషన్ సరకులను తీసుకు వచ్చేందుకు చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి పేదలకు చేసిన మంచిని తుడిచేయాలనే లక్ష్యంతో కూటమి పాలన సాగిస్తుందని పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేయడం లేదని విమర్శించారు.ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకున్న ఈ విధానాన్ని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తుంగలోకి తొక్కేసిందని ఆరోపించారు. ఎండి యు వాహనాల రద్దు వల్ల సుమారు 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఇప్పటికే వాలంటీర్లను ఉద్యోగాలను తొలగించి లక్షల మందిని రోడ్డున పడేశారని ,కూటమి అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోయారు. మద్యం షాపులు ప్రవేటీకరణ , 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని గాలికి వదిలేసి ,ఉద్యోగాలను ఇవ్వకపోగా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఉద్యోగాలను పీకేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ కక్షలతో



బడుగు ,బలహీన వర్గాల జీవనోపాధి పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. ఎండి యు వాహనాల రద్దు నిర్ణయాన్ని విరమించుకోవాలని తెలిపారు.


## మన ధరిత్రి మన ఆరోగ్యం- జూన్ 21 వరకు యోగపై మాసోత్సవ అవగాహన కార్యక్రమాలు

**తాళ్లపూడి,మే21, ప్రజా జ్యోతి న్యూస్** తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలోయోగాంధ్ర ప్రచార కార్యక్రమం ప్రారంభోత్సవం బుధవారం ఉదయం నిర్వహించడం జరిగింది. మన ధరిత్రి మన ఆరోగ్యం ("యోగ ఫర్ వన్ ఎర్త్ - వన్ హెల్త్") అనే నినాదంతో ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా



దినోత్సవం జరుపుకుంటున్నామని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్థాయి అధికారులు అన్నారు దండాసనం, వృక్షాసనం, సర్వాంగాసనం, అమృతాసనం వంటి ఆసనాలను వేయించి, యోగాసనాల ప్రాముఖ్యతను వివరించిన డ్రిల్ మాస్టర్స్. ఈ సందర్భంగా పలువురు మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగా మాసంగా పాటిస్తూ యోగ సాధన పై గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, వివిధ యోగా అభ్యాసాలపై అంశాలపై ప్రజలందరికీ ప్రభుత్వం అవగాహన కల్పిస్తుందన్నారుసీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మానవ వనరుల శాఖామాత్యులు నారా లోకేష్ ల ఆధ్వర్యంలో యోగాకు సంబంధించి వివిధ కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో ఎంపీడీవో టి.బి.వి రమణ, ఎస్సై టి.రామకృష్ణ, ఎంఈఓ బాలమణి, నెహ్రూ, డాక్టర్ బి .భవాని ,ఏఎస్ఓ జోడాల వెంకట్, మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

## స్కూల్ కాంప్లెక్స్ నిధులు దుర్వినియోగం కాలేదు ఎంఈఓ బాలామణి, నెహ్రూజీ



**తాళ్లపూడి మే 21, ప్రజాజ్యోతి న్యూస్** నిధులు దుర్వినియోగం ఆరోపణలపై ఎంఈఓ బాలామణి మరియు నెహ్రూజీ మాట్లాడుతూగత రెండు సంవత్సరాల నుంచి నిధులు ఏమి రావడం జరగలేదని ఈ సంవత్సరంలోనే నిధులు వచ్చాయని కాంప్లెక్స్ తీసివేసి వాటి ప్లేస్ లో క్లస్టర్ గా ఏర్పాటు చేయడం జరిగిందని తాళ్లపూడిలో ప్లేస్ లేనందున వేగేశ్వరపురం క్లస్టర్లో అభివృద్ధి చేయడానికి కొత్త క్లస్టర్లో లక్ష రూపాయల వరకు వచ్చాయని కొత్తగా ఏర్పాటు అయిన క్లస్టర్ కారణంగా వాటిని చైర్మన్ మరియు కమిటీ మెంబర్స్ తో మాట్లాడి ప్రింటర్, బీరువా, కుర్చీలు, మొదలైన వాటిని కొనుగోలు జేయడం జరిగిందని తెలిపారు. పాఠశాల ల్లో మౌలిక అవసరాల నిమిత్తం విడుదలైన నగదను స్కూల్ అవసరాల నిమిత్తం పలు రకాల వస్తువులను కొనుగోలు చేయడం జరిగిందని ఎంఈఓ బాలమణి తెలిపారు. నిధులు దుర్వినియోగం జరిగిందని వచ్చిన ఆరోపణలపై పూర్తి విచారణజరిపిఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని ఎంఈఓ 2 నెహ్రూజీ తెలిపారు

## తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాలర్స్ దివాకర్ రెడ్డి..





**మే 21,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గా డాలర్ దివాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో ప్రతిష్టాత్మకమైన తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ( తుడా) చైర్మన్ గా తిరుపతికి చెందిన డాలర్ దివాకర్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత సాధారణ ఎన్నికల్లో డాలర్ దివాకర్ రెడ్డి అటు తిరుపతి నియోజకవర్గంలోనూ ఇటు చంద్రగిరి నియోజకవర్గంలోనూ తెలుగుదేశం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం గట్టిగా పని చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం తుడా పదవికి అత్యంత పోటీ ఉన్నప్పటికీ ఆయనకు కట్టబెట్టింది. బుధవారం మధ్యాహ్నం తుడా వైస్ చైర్మన్ మౌర్య సమక్షంలో ఆయన తుడా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. అందుకు మునుపు స్థానిక తుమ్మలగుంట నుంచి తుడా కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత్ వైపు చూడకుండా ప్రధాని మోడీ గట్టి సమాధానం చెప్పారు.


పాలకొల్లులో సైనికులకు మద్దతుగా జరిగిన జండా యాత్రలలో మంత్రి నిమ్మల రామానాయుడు





**పాలకొల్లు.ప్రజా జ్యోతి (కొట్టి రామం) మే 21.** భవిష్యత్తులో భారతదేశం వైపు ఎవరు తొంగి చూడకుండా ప్రధానమంత్రి మోడీ గట్టి సమాధానం చెప్పారని దేశ సైనికులు అందరికీ ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పాలకొల్లులో బుధవారం తెలుగుదేశం ఆధ్వర్యంలో పాలకొల్లు ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి గాంధీ బొమ్మల సెంటర్ వరకు వేలాదిమంది నాయకులు కార్యకర్తలు ప్రజలతో కలిసి 100 మీటర్ల పొడవైన జాతీయ జెండా పట్టుకుని పాదయాత్రగా జెండాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ బొమ్మల సెంటరు వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్ల ఆదేశాలతో పాలకొల్లులో సైనికులకు మద్దతుగా జెండాయాత్ర చేపట్టమన్నారు ఈ జెండాయాత్రలో పార్టీలకు వర్గాలకు మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారన్నారు. ఈ విధమైన జెండాయాత్రలు సైనికులకు స్ఫూర్తి ని ఇస్తాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ టిడిపి నాయకులు డి వెంకటేశ్వరరావు పి బాబు కోడి విజయభాస్కర్ కె గౌరు నాయుడుకె రోజారమణి బిజెపి నాయకులు ఉన్నమట్ల కపర్థి వై పద్మారావు జనసేన నాయకులు తులా రామలింగేశ్వరరావు మైగాపుల పద్మ పాలకొల్లు యలమంచిలి పోడూరు మండలాల, పాలకొల్లు పట్టణ కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి గాంధీ బొమ్మల వరకు త్రివర్ణ పతకాల రెప రెప లతో సాగిన జెండాయాత్రను దారి పొడవునా ప్రజలు ఆసక్తితో తిలకించారు.

## రామాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమంతుడి కళ్యాణం




**కంచికచర్ల, మే 21 - ప్రజాజ్యోతి** కంచికచర్ల పట్టణంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో రామాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం శ్రీ రామాలయంలో ఉదయం హనుమాన్ చాలీసా పారాయణము జరుగుతుందని, సాయంత్రం 6 గంటలకు శ్రీ హనుమాన్ కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని అలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్ని స్వామి వారి కళ్యాణం మహెూత్సవాని తిలకించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ తారంబాబు తెలిపారు.

## కంచికచర్ల ఎక్సైజ్ కార్యాలయంలో యోగాసనాలు



**కంచికచర్ల, మే 21 - ప్రజాజ్యోతి** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిశ బుధవారం 21 వ తేదీ నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాల మేరకు కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్లో బుధవారం ఉదయం సర్కిల్ ఇన్స్పెక్టర్ అశ్ర పున్నీసాబేగం , ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్సై ,సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ యోగ ప్రాణాయామం క్రమం తప్పకుండా పాటిస్తే ఎటువంటి వ్యాధులైన దరి చేరవని , యోగాసనాలు ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, ప్రతి ఒక్కరు దినచర్యలో భాగంగా యోగాను క్రమం తప్పకుండా పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ గాలిబ్ సాహెబ్ మిగతా సిబ్బంది యోగసనాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎం డి యు వేవస్థ రద్దుపై హార్షం డీలర్ల పోరాటాలకు ప్రభుత్వం మద్దతు.

**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర** డీలర్ల సంఘము జిల్లా ప్రధాన కార్యదర్శి కొణదం ఉమశంకరరావు ఎం డి యు వేవస్థ రద్దు చేస్తూ పాత పద్ధతి లోనే రేషన్ దుకాణాలు నిర్వహణ కు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హార్శనీయం నీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొణదం ఉమశంకరరావు హార్షం వేక్తం చేసారు గత ప్రభుత్వం ఎం డి యు వేవస్థ ప్రవేశపెట్టి రేషన్ కార్డు దారులు ను మరియు డీలర్ వేవస్థ ను ఎన్నో ఇబ్బందులు కు గురిచేసారు ఒక ఏడాదికి 830కోట్లు ఎం డి యు వేవస్థ కి చెల్లింపులు చేస్తూ ప్రజలు పై ఆర్థిక భారం మోపారు ఇప్పటికి ఎం డి యు వేవస్థ లో లోపాలు దీని వలన ప్రయోజనం లేదు ప్రభుత్వం నీ కి చెడ్డ పేరు వస్తుంది రేషన్ కార్డు దారులకు ఇబ్బందులు గుర్తించి రద్దు చేయడం హార్శనీయం అదే రేషన్ షాప్ ద్వారా రేషన్ పంపిణి అయితే ఉదయం 8నుండి 1 గంట వరకు 4నుండి 8 గంటలవరకు ఎప్పుడు అయినా వెళ్లి 1 నుండి 15 వ తేదీ వరకు తీసుకోని వెళ్ళవచ్చు అని ప్రజలు గురించి అలోచించి న ఈ ప్రజా ప్రభుత్వం నీ కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారికి నారా లోకేష్ గారికి నాదెండ్ల మనోహర్ గారికి మా రాష్ట్ర అధ్యక్షులు దివి లీలా మాధవరావు గారికి జిల్లా డీలర్స్ అందరం అభినందనలు తెలియజేస్తూ మీరు మా పై పెట్టిన నమ్మకాన్ని ప్రజలు కు టైమ్ కు రేషన్ సరుకులు ఇస్తూ



ప్రభుత్వం ని కి మంచి పేరు తెస్తామని హామీ ఇస్తున్నాము దర్శి కొణదం ఉమశంకరరావు జిల్లా రేషన్ డీలర్స్ ప్రధాన కార్య

## వడదెబ్బ నివారణకు హెూమియో మందుల పంపిణీ

**నందిగామ, మే 21 – ప్రజాజ్యోతి** వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్త చర్యలు ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రముఖ హెూమియో వైద్యులు డాక్టర్ బొందలపాటి నరసింహారావు సూచించారు.. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నందిగామ గాంధీ సెంటర్ లో బుధవారం వడదెబ్బ నివారణకు హెూమియో మందుల పంపిణీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని నందిగామ పట్టణ సిఐ వై వి ఎల్ వి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి సాయంత్రం వరకు లైన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రజలకు వడదెబ్బ నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు ప్రతినిధులు అమ్మినేని జ్వాల ప్రసాద్, టీ సీతారామయ్య,ఎం సీతారామయ్య, వై గాంధీ, మారం సత్యం, ఆర్ ఎల్ నరసింహారావు (ఆర్కే క్లాత్) నూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## వీఆర్వో అలసత్వం..? ఇబ్బందులలో పట్టణ ప్రజలు..!

**కంచికచర్ల, మే 21 – ప్రజాజ్యోతి**




కొత్త రేషన్ కార్డుల జారీ మరియు సవరణ విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రతిష్టాత్మక నిర్ణయానికి గత రెండు సంవత్సరాల నిరీక్షణకి న్యాయం జరిగిందని ప్రజలు హర్షం వెలిబుచ్చారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కొత్త రేషన్ కార్డుల జారీ మరియు సవరణ విషయంలో అధికారుల అలసత్వం వలన విసిగి వేసారి పోతున్న కంచికచర్ల సచివాలయం-2 పరిధి లోని ప్రజలు. రేషన్ కార్డ్ అప్లికేషన్ సచివాలయంలో ఆన్లైన్ చేసుకున్న అనంతరం సచివాలయంలోనే ఈకేవైసీ పూర్తి చేసుకున్న తర్వాత ఆన్లైన్ ద్వారా వీఆర్ లాగిన్ కి అప్లికేషన్లు వస్తాయి. వీఆర్వో లాగిన్ నుంచి ఎమ్మార్వో లాగిన్ కి ఫార్వర్డ్ అవుతాయి. ఈ ప్రక్రియలో వీఆర్వో లాగిన్ లో అప్రూవ్ కొట్టడానికి సవాలక్ష కుంటి సాకులు చెప్పి, ఎన్నో అప్లికేషన్లు పెండింగ్లో ఉంచారు. ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న అప్లికేషన్లను వెంటనే పరిష్కరించ వలసిందిగా అర్జీ దారులు మొరపెట్టుకుంటున్నారు. 21 రోజులు పడుతుందనే కుంటి సాకుతో ఆన్ లైన్ చేసిన అప్లికేషన్లన్నింటిని పెండింగ్లో పెడుతున్న వీఆర్వో. ఈ అధికారి అలసత్వం వలన కొత్త రేషన్ కార్డుల జారీ మరియు సవరణ విషయంలో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విధుల్లో అలసత్వం ప్రదర్శించిన వీఆర్వో పై తగిన చర్యలు తీసుకొని ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా తగిన ఆదేశాలు ఇవ్వవలసిందిగా సంబంధిత అధికారులను కంచికచర్ల పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.

## ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా తిరంగా ర్యాలీ



**తాళ్లపూడి, మే 21, ప్రజాజ్యోతి న్యూస్** ఉగ్రవాదులను అంతం చేయడమే లక్ష్యమని కూటమి నాయకులు అన్నారు. ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా ప్రక్కిలంకటి జంక్షన్ నుండి తాళ్లపూడిమెయిన్ రోడ్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవాహారంగా ఏర్పడి భారత్ మాతాకీ జై, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురుమాట్లాడుతూ దేశంలో భారతీయులంతా ఐక్యంగా ఉంటే దేశం అభివృద్ధి చెందుతుం దన్నారు. మన మేధా శక్తి ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు

## ఏపిఇఏపిసెట్2025 పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన యస్వీయూ విసి



**మే 21,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అప్పారావు ఈ రోజు ఉదయం తిరుపతిలోని టిసియస్.ఇయాన్ డిసిటల్ పరీక్ష కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి పక్షాన జరుగుతున్న ఏపి ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ -2025 పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో పరీక్ష ప్రశాంతంగా జరుగుతున్నాయని వారు అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వవిద్యాలయం, కాకినాడ వారు ఈ పరీక్షలు వారు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మే 21 నుండి 27 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

## శ్రీకృష్ణదేవరాయనగర్ నందు సమాచార హక్కు చట్టం- 2005 పై అవగాహన సదస్సు




**బద్వేల్ మే 21 (ప్రజా జ్యోతి న్యూస్)** బుధవారం నాడు స్థానిక పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయనగర్ నందు సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్ మాట్లాడుతూ ఆర్.టి.ఐ చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని తెలిపారు. సమాచారం కొరకు ప్రభుత్వ కార్యాలయాలలోని అధికారుల చుట్టూ తిరగకుండా ఇంటినుండే ఒక్క దరఖాస్తు ద్వారా 30 రోజుల్లో కావలసిన సమాచారం పొందవచ్చని దరఖాస్తు చేయుట,అప్పీలు చేయుట తదితర చట్టం లోని సెక్షన్లన గురించి వివరించారు. అనంతరం ప్రింట్ చేయించిన దరఖాస్తు ఫారాలను, అప్పీలు ఫారాలు హాజరైన ప్రజలకు, సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టన్ రైజర్...





**మే 21,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** తిరుపతి లోని శ్రీ. పద్మావతి మహిళా మల్టిపర్పస్ కాంప్లెక్స్ నందు జూన్ 21 అంతర్జాతీయ యోగా డేని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు కార్యక్రమంలో పాల్గొని యోగా చేయడం జరిగినది . ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మీడియా తో మాట్లాడుతూ.. ఈరోజు మే 21 నుంచి జూన్ 21 వరకు ఒక నెలపాటు యోగాంధ్ర మాస ఉత్సవాల జరగనున్నాయి అని అన్నారు.యోగా ను ఊరు వాడ లోని ప్రజల్లోకి బాగా తీసుకెళ్ళే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి కూడా విశాఖపట్నంలో జూన్ 21వ తేదీన ఈ కార్యక్రమానికి హజరౌతారు అని వివరించారు. యోగా విశిష్టతను ప్రజలుకు తెలిసే విధంగా కార్యక్రమాలు చేయాలి అని చెప్పారు.తిరుపతి జిల్లా వ్యాప్తంగా పలు ప్రదేశాల్లో ఈ యోగ కార్యక్రమం నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నాము అని అన్నారు

## చెరుకులపాడునారాయణరెడ్డికి ఘననివాళులు

**శభాష్ పురం హనుమంతు**



**ప్రజా జ్యోతి తుగ్గలి :** పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ భర్త, వైసిపి నియోజవర్గ ఇన్చార్జి చెరుకులపాడు నారాయణరెడ్డి కు శభాష్ పురం హనుమంతు, లంకాపల్లె హనుమంత రెడ్డి, వైసిపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. స్వర్గీయ చెరుకులపాడు నారాయణ రెడ్డి 8 వ వర్ధంతి సందర్భంగా బుధవారం చెరుకులపాడు లో నారాయణ రెడ్డి సమాధి వద్ద వారు పూలమాలవేసి నివాళులు అర్పించారు.శభాష్ పురం హనుమంతు, మాట్లాడుతూ స్వర్గీయ నారాయణరెడ్డి నియోజకవర్గంలోనే పేద ప్రజల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, అందువల్ల పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వారు మాట్లాడారు. అలాగే ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ నిత్యం ప్రజా సమస్యల కోసం కృషి చేస్తున్నారని అన్నారు. శ్రీదేవమ్మ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

**పొందూరు,**



**ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండలం కల్యాణి పేట వద్ద గల నయారా పెట్రోల్ బంకు వద్ద అగ్ని ప్రమాదాలు ,వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రణస్థలం అగ్నిమాపక సిబ్బంది పి అశోక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ ధర సిబ్బందికి ,అక్కడికి వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు,గ్యాస్ ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. వీటితో పాటు ఇంటిలో వాడే గ్యాస్ సిలిండర్ల పైన కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పొందూరు అగ్నిమాపక సిబ్బంది ఏ రామకృష్ణ ,బి ధర్మారావు పాల్గొన్నారు.

## శారీరక మరియు మానసిక ఆరోగ్యం కావాలంటే ప్రతిఒక్కరు తప్పక యోగ చెయ్యాలి జిల్లా కలేక్టర్ రాజకుమారి ఘనియా , ఎన్ఎండి ఫిరోజ్




**నంద్యాల జిల్లా : బ్యూరో మే21(ప్రజా జ్యోతి) :** అంతర్జాతీయ యోగా దిన మాసోత్సవ ప్రారంభ వేడుక కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్రా కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘనియా గారి చేతులా మీదుగా ఘనంగా ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని నంద్యాల ప్రజలతో కలిసి ఎన్ఎండి ఫిరోజ్ వివిధ యోగసనాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ యోగ అనేది భారతీయ సంస్కృతి అందించిన గొప్ప బహుమతన్నారు. యోగ చేయడం వల్ల శారీరక మరియు మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. యావత్తు ప్రపంచం యోగ ఉపయోగాలు తెలుసుకొని యోగను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నరాని దాని వల్ల ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా యోగ వల్ల ఎన్నో రోగాలు నయామవుతా యన్నారు. తాను కూడా పనుల బిజీ నుండి కాస్త ఉపషామానం కోసం తరుచూ యోగ చేస్తుంటాని తెలిపారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ , యోగ గురువులు, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు నంద్యాల జిల్లా ప్రజా జ్యోతి తెలుగు దినపత్రిక బ్యూరో వారల మద్దిలేటిస్వామి , ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభం.






**అనంతగిరి మే 21.ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** ప్రభుత్వ ఆదేశాలు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్సూచనలు మేరకు మండల కేంద్రమైన అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభం జరిగింది. మండల శాఖ అధికారులు యోగ కార్యక్రమం చేపట్టారు మానవుని దినచర్యలో భాగంగా ప్రతిరోజు యోగ చేయటం వలన మానసికంగా.శారీరకంగా ఎంతో దృఢంగా ఉండవచ్చు నని. అంతేకాకుండా సమాజ అభివృద్ధిలో భాగం కావచ్చునని. యోగ యొక్క విశిష్టతను తెలియపరిచారు. ఈనెల 21.వ తేదీ మొదలుకొని జూన్ 21.వ తేదీ వరకు యోగా కార్యక్రమాలు జరుగుతాయని. ప్రతి పంచాయతీ కార్యాలయాల్లో కార్యక్రమాలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి అనంతగిరి జెడ్పి.టి.సి దిసరి గంగరాజు.సోమల రుతు. మండల శాఖ అధికారులు ఏ టి.డబ్ల్యూ. ఓ కె.వెంకటరమణ. విద్యాశాఖ అధికారి కే. బాలాజీ మౌలాలి. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పురపాలక సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్ సిబ్బంది సేవలు అభినందనీయం




**బద్వేల్ మే 21 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలో మైదుకూరు రోడ్ లోని పురపాలక సంఘానికి చెందిన పెట్రోల్ బంక్ రోజు వారి వ్యాపారం సరాసరి 5.50 లక్షలకు చేరిందనీ పెట్రోల్ బంక్ సిబ్బంది ఉత్తమ సేవలందించడంతో వ్యాపార అభివృద్ధి లో ముందుకు పోతున్నందుకు వారి సేవలను మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి పట్టణ ప్రణాళిక అధికారి సతీష్ కుమార్ అభినందించారు. అలాగే పురపాలక సంఘానికి చెందిన పెట్రోల్ బంక్ పై నమ్మకంతో వ్యాపార అభివృద్ధికి సహకరించిన వినియోగదారులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది వినియోగదారులు పెరిగేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి



**గుంతకల్లు మే 21 (ప్రజా జ్యోతి):** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 34 వ వర్ధంతి సందర్భంగా గుంతకల్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయము నందు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త దవల్తాపురం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి కొద్ది కాలంలోనే ఎనలేని సేవలందించి భారతదేశానికి ఐటీ రంగాన్ని ఇచ్చినటువంటి ఘనత ఒక్క రాజీవ్ గాంధీకే దక్కుతుందని,ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రాజీవ్ గాంధీ అడుగుజాడల్లోనే నడవాలని ఆయన ఆశయాలను కొనసాగించి కాంగ్రెస్ పార్టీని తిరిగి రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ అధికారంలోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు తగరం రామాంజనేయులు,జిల్లా జనరల్ సెక్రెటరీ చిప్స్ భాష, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, గుంతకల్లు బీసీ సెల్ అధ్యక్షులు పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కు ఎం డి యూ ఆపరేటర్లు వినతి




గుంతకల్లు పట్టణంలోని ఎం డి యు ఆపరేటర్లు ఎమ్మార్వో రమాదేవి, సి ఎస్ డీ టి సుబ్బలక్ష్మి నీ కలిసి తమన విధుల నుంచి తొలగించకూడ దని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.వారు మాట్లాడుతూ తమను విధులనుంచి తొలగించడం చాలా అన్యామని వాపోయారు. మాకు అగ్రిమెంట్ ప్రకారం 2027 వరకు కొనసాగించాల ని నిబంధనలు ఉన్నాయి కానీ కూటమి ప్రభుత్వం మమ్మల్ని తొలగించే ప్రయత్నం చేస్తుందని,మాకు న్యాయం చేయాలని తాసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

## నేడే శ్రీ ఆంజనేయస్వామి జయంతి వేడుకలు...

పూజారి వడ్ల ప్రహల్లాద్..



**ప్రజా జ్యోతి తుగ్గలి** మండల కేంద్రమైన తుగ్గలి కృష్ణాపురం కొండల్లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు న ఘనంగా నిర్వహించినట్లు ఆంజనేయ స్వామి దేవస్థానం పూజారి వడ్ల ప్రహల్లాద్ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం నుండి పూజా కార్యక్రమాలు, 22న గురువారం ఉదయము పూజా కార్యక్రమము వడ్ల వారి కుటుంబ సభ్యులచే నిర్వహించబడుతున్నట్లు వారు తెలిపారు. ఉదయము 10 గంటలకు కళషోత్సవం, సాయంత్రం మూడు గంటలకు కుంభోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, పూజారి వడ్ల ప్రహల్లాద సమక్షంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంకాలము తుగ్గలి గ్రామం నందు ఊరేగింపు కార్యక్రమము, రాత్రి 8 గంటల నుండి తుగ్గలి భజన బృందం రాతన చెన్నంపల్లి భజన బృందం వారిచే జరుగుతున్నట్లు వారు తెలిపారు. మొదటి బహుమతి రు. 16,000 వడ్ల రామాంజనేయులు, రెండవ బహుమతి రు. 13,000 వడ్ల పెద్ద మల్లయ్య, మూడవ బహుమతి రు. 10,000 ఎన్ ఆర్ స్వామి, నాలుగవ బహుమతి రు. 8,000 ఎన్ఆర్ స్వామి, ఐదవ బహుమతి రు. 6,000 రాంబాబు, ఆరవ బహుమతి రు. 5,000 బోయ లక్ష్మీనారాయణ, ఏడవ బహుమతి రు.5,000 నాగరాజు, ఎనిమిదవ బహుమతి రు.4,000 విలేకరి చిన్నారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, తొమ్మిదవ బహుమతి రు. 3,000 ఆకుల శ్రీనివాసులు, పదవ బహుమతి రు.2,500 బ్యాంకు శీను, 11వ బహుమతి రు. 2,000 హెూటల్ నాగేంద్ర,12 వ బహుమతిరు. 1,000 మంగలి రామాంజి తదితరులు బహుమతులను ఇచ్చినట్లు పూజారి వడ్ల ప్రహల్లాద తెలిపారు.

# ఇంటిలో బంగారం దొంగతనం చేసిన దొంగను అరెస్టు చేసిన రూరల్ పోలీసులు




**8 తులాల బంగారం స్వాధీనం**

**గుంతకల్లు మే 21 (ప్రజాజ్యోతి):** గుంతకల్లు పట్టణంలోని బాబు జగ్జీవన్ కాలనీలో తాళం వేసిన ఇంటిలో బంగారం దొంగతనం చేసిన మొక శ్రీనివాస్ ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఎనిమిది తులాల బంగారమును స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ ప్రవీణ్ కుమార్ బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల్లోకి వెళితే కదిరి పట్టణం నందు నివాసముంటున్న ఎస్, భాను, (25) భర్త ఉబేదుల్లా ఈనెల 13న గుంతకల్లు పట్టణంలోని బాబు జగ్జీవన్ రావు కాలనీలో నివాసముంటున్న తన తమ్ముడు ఇంట్లో నామకరణం కార్యక్రమాన్ని కి వచ్చినది. అయితే ఈ నెల 17న ఫిర్యాది భాను తన వదినకు ఒంట్లో బాళగోలేదని ఆసుపత్రికి పిలుచుకొని ఇంటికి బీగాలు వేసి వెళ్లిందని,ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చి చూడగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇంటికి ఉన్న బీగం తెరిచి ఇంటిలో ఉన్న బీరువాలో 8 తులాల బంగారం దొంగతనం జరిగిందని ఎస్. భాను, భర్త ఉబేదుల్లా గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్ సిఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసుకుని,గుంతకల్లు ఎస్ డి పి ఓ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఒక టీం ఏర్పాటు చేసి ముద్దాయి యొక్క ఆచూకీ కొరకు అక్కడి పరిసరాల లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గాలిస్తుండగా ఈనెల 21వ తేదీ బుధవారం ఒక వ్యక్తి అనుమానాస్పందంగా గుంతకల్లు పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అనుమాన స్పందనంగా తిరుగుతున్నాడ ని గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. రాఘవేంద్రప్ప కి వచ్చిన సమాచారం మేరకు ఎస్ ఐ రాఘవేంద్రప్ప అక్కడికి వెళ్లి అనుమానాస్పందంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకొని విచారించగా అతని పేరు మొక శ్రీనివాస్ వయసు 35 సంవత్సరాలు తండ్రి పేరు వెంకటేశ్వర్లు పాత గుంతకల్లు లోని కుంటేమ్మ కట్ట అని చెప్పాడు,అతని జోబిలు తనిఖీ చేయగా ఒక చిన్న ప్లాస్టిక్ కవర్లో బంగారు అభరణాలు ఉన్నవి ఇవి ఎక్కడవని గట్టిగా విచారించు గా సదరు ఆభరణాలు బాబు జగ్జీవన్ రావు కాలనీలోని ఒక తాళం వేసిన ఇంటిలో దూరి బీరువా తెరిచి దొంగతనం చేసినాను అని చెప్పినాడు. అతనిని ఎస్సై అరెస్టు చేసి అతని వద్ద నుంచి 80 గ్రాముల ఒక సాదా బంగారు నక్లెస్,ఒక బంగారు లాంగ్ చైన్,ఒక జత బంగారు కమ్మలు,ఒక బంగారు చైన్, చిన్నపిల్లలకు చెందిన మూడు బంగారు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ప్రవీణ్ కుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ బంగారమును కోర్టులో అప్పగించి ఫిర్యాదుదారులు కు అందజేస్తామని సీఐ తెలిపారు.

# పోలీస్ స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

విక్రాంత్ పటేల్




**ప్రజా జ్యోతి తుగ్గలి :** మండల కేంద్రమైన తుగ్గలి జొన్నగిరి పోలీస్ స్టేషన్లను కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్ ఐపిఎస్ తుగ్గలి జొన్నగిరి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖి చేశారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా పోలీస్ స్టేషన్ లో కేసులకు సంబంధించిన ఫైళ్లను, పోలీస్ స్టేషన్ కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టేషన్లో సీసీటీఎన్ఎస్ లోని ఎఫ్ఐఆర్-చార్జిషీట్, మీసేవ, హెచ్ ఆర్ ఎం ఎస్ అన్ని అప్లికేషన్లను పరిశీలించారు. తదుపరి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా..పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాది దారులతో మర్యాదపుర్యకంగా ఉంటూ వారి యొక్క సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలని, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్లైన్లో ఎంటర్ చేయాలని తెలియజేశారు. సిబ్బంది పోలీసు స్టేషన్ లోని ప్రతి గ్రామం గురించి అవగాహన కల్గివుండాలని, ప్రజలతో మమేకమై, ప్రజలకు మరింత చేరువ కావాలని తెలిపారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి ప్రతిఫలం దక్కుతుందని తెలియజేశారు.అదేవిదంగా ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులను, పరిసరాలను, శుభ్రంగా ఉంచాలని తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట డిఎస్పి వెంకట్రామయ్య, పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్, జొన్నగిరి ఎస్సై ఎన్ సి. మల్లికార్జున, తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## చెరుకులపాడునారాయణరెడ్డికి ఘననివాళులు అర్పించిన.. వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ గుంత రఘు..



**ప్రజా జ్యోతి తుగ్గలి** : పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ భర్త, వైసిపి నియోజవర్గ ఇన్చార్జి చెరుకులపాడు నారాయణరెడ్డి కు మాజీ వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంత రఘు , మరియు మండల వైసిపి నాయకులు ఘన నివాళు లు అర్పించారు. స్వర్గీయ చెరుకులపాడు నారాయణ రెడ్డి 8 వ వర్ధంతి సందర్భంగా బుధవారం చెరుకులపాడు లో నారాయణ రెడ్డి సమాధి వద్ద వారు పూలమాలవేసి నివాళు లు అర్పించారు. గుంత రఘు , మాట్లాడుతూ స్వర్గీయ నారాయణరెడ్డి నియోజకవర్గంలోనే పేద ప్రజల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, అందువల్ల పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వారు మాట్లాడారు. అలాగే ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ నిత్యం ప్రజా సమస్యల కోసం కృషి చేస్తున్నారని అన్నారు. శ్రీదేవమ్మ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల నాయకులు మరియు గ్రామ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

## గృహాలను త్వరితగతిన పూర్తి చేయండి.. హౌసింగ్ పీడీ చిరంజీవి



**ప్రజా జ్యోతి తుగ్గలి :** ప్రభుత్వం మంజూరైన గృహాలను త్వరితగతిన పోస్ట్ చేయాలని గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి అన్నారు. శనివారము మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా గృహ నిర్మాణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వమ్మోహన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏఈ లు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ ను కలిసిన వైసిపి నాయకులు

**వైసిపి ఐటి విభాగపు అధ్యక్షులు తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు తుగ్గలి ప్రవీణ్ కుమార్ రెడ్డి**



**ప్రజా జ్యోతి తుగ్గలి** పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ను వైసిపి ఐటి విభాగపు అధ్యక్షులు తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు తుగ్గలి ప్రవీణ్ కుమార్ రెడ్డి లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి నేత స్వర్గీయ చెరుకులపాడు నారాయణరెడ్డి ఎనిమిదో వర్ధంతి సందర్భంగా చెరుకులపాడు లో నారాయణరెడ్డి సమాధి వద్ద వారు నివాళు లు అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు.

**భూగర్భ జలాల నాణ్యతను పర్యవేక్షించుటకు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డిఓ దాసిరాజు.**




పోడూరు, మే 21,ప్రజాజ్యోతిన్యూస్. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఏలూరివారి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు ఏర్పాటు చేసి నట్లు ఆర్డిఓ దాసిరాజు అన్నారు.పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం కవిటం జిల్లా పరిషత్ పాఠశాలలో భూగర్భ జలాల నాణ్యతను పర్యవేక్షించుటకు బుధవారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం సమగ్ర పర్యావరణ, పర్యవేక్షణ ప్రణాళికను రూపొందించారన్నారు.నిర్మాణం, కార్యాచరణ కోసం ఎంఓఇఎఫ్, సిసి /ఎన్ఏబి ఎల్ గుర్తింపు పొందిన ప్రయోగశాలల ద్వారా పరిసర గాలి, నాణ్యత శబ్ద స్థాయిల, నేల, భూగర్భ జలాలు నాణ్యతను పర్యవేక్షించుటకు అవగాహన కల్పిస్తున్నమన్నారు.ఇది రూ. 400 కోట్ల తో రూపొందిస్తున్నట్లు అయన తెలిపారు.ఈకార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్ జయ కుమార్, సీఈవో అజయ్ కుమార్, నాగిరెడ్డి, కె వెంకటేశ్వర్లు,తాసిల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్, ఎంపీడీవో, ఎంపీపీ, పోడూరు కవిటం గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచ్ మేడపాటి గంగాధర్ రెడ్డి, రుద్రరాజు రమేష్ రాజు, ఆర్ ఐ రాంబాబు, వీఆరో లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఉగ్రవాదానికి మంగళం పలకాలి

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఒక చోట ఏవో అలజడులు చెలరేగుతూనే ఉన్నాయి. మానవ రుధిరం ఏరులై ప్రహహిస్తూనే ఉంది. మతం పేరుతోనో, ప్రాంతం పేరుతోనో మారణకాండ విశృంఖల విహారం చేస్తూనే ఉంది. ఒక వైపు ఉక్రెయిన్–రష్యా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఇజ్రాయెల్, హమాస్ దాడులు గాజాను రక్తం సిక్తం చేసాయి. పాక్ ప్రేరణతో భారత్‌లో సీమాంతర ఉగ్రవాదం ప్రబలింది. ఇటీవల పహల్గాంలో అమాయకులను ఉగ్రవాదులు అత్యంత దారుణంగా కాల్చిచంపడంతో భారత్–పాక్‌ల మధ్య తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మనుషుల ప్రాణం తీసే మానసిక ఉన్మాదం పతాక స్థాయికి చేరింది. ఇతర దేశాలను నరమేథంతో దారికి తెచ్చుకోవాలనే పరాకాష్ఠకు చేరిన పైశాచిక అకృత్యాన్ని 'ఉగ్రవాదం' గా పేర్కొనవచ్చు. ఉగ్రవాదం ఆధునిక కాలంలో కొనసాగుతున్న అత్యంత క్రూరమైన ఆటవిక చర్య. ఉగ్రవాదం భారతదేశానికి ఒక విషమ సమస్యగా మారింది. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కూడా భారతదేశం అనేక రూపాల్లో కొనసాగుతున్న ఉగ్రవాదం వలన నష్టపోతూనే ఉంది. దేశవిభజన సమయంలోనే అనేక విధాలుగా నష్టపోయాం. ఇప్పుడు కూడా ఉగ్రవాదం రూపంలో పరాయి మూకలు దేశాన్ని కబళించాలని చూస్తున్నాయి. ఇతరుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను గుర్తించి గౌరవించిన దేశానికి నేటికీ కష్టాలు తప్పలేదు. బంగ్లా విమోచనకోసం పోరాడినా, లంకేయుల దేశసమగ్రత కోసం శ్రీలంకకు శాంతి సైన్యాన్ని పంపించి కాపాడినా భారత దేశానికి శత్రుబాధలు తప్పలేదు, చేదు ఫలితాలను చవిచూస్తున్నాం. పొరుగు దేశాల్లోని ఉగ్రవాదుల పంజాకు భారతదేశం మూల్యం చెల్లించుకోవడం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అదొక అనాగరిక, అమానుష ప్రక్రియగానే భావించాలి. అమాయ ప్రజల రుధిరంతో తడిసిన కర్కశమూకల వికృత ఆగడాలకు అడ్డాగా మారిన ఉగ్రవాద సంస్థలకు ఊతమిచ్చే ఏ దేశమైనా తమ పాపకృత్యాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. రాయబారాలతో, ఒప్పందాలతో రాజీపడని మనస్తత్వాలకు దండోపాయమే శరణ్యమన్న సూత్రం ఇటీవల భారత్ జరిపిన ఆపరేషన్ సందూర్ నిరూపించింది. ఉగ్రవాద శిబిరాల ధ్వంసం ఉరిమురిమి చూసే ఉగ్రదేశమైన పాకిస్తాన్‌కు ముచ్చెమటలు పట్టించింది. భారత శాంతి వచనాలను పొరుగు దేశం అసమర్థతగా భావించడం తెంపరితనం. అవసరార్థ స్నేహాలను చూసుకుని పాక్ రెచ్చిపోతే భారత్ నుంచి ప్రతిఘటన అంతకు వెయ్యి రెట్లుంటుందనే వాస్తవాన్ని దాయాది దేశం గమనించాలి. నాగరికత వెల్లివిరిసిన నేటి ప్రపంచంలో మనుషుల రక్తం తాగే ఉగ్రవాద మూకలు ఆటవిక మానవులకంటే వికృతంగా, క్రూరంగా ప్రవర్తించడం మానవత్వానికే మాయని మచ్చ. ప్రపంచమంతా ఉగ్రవాదాన్ని అసహ్యించుకుంటున్నా 'నవ్విపోదురు గాని నాకేటి సిగ్గు' అనే రీతిలో పాక్ బరితెగించింది. పాక్ ప్రభుత్వం, మిలిటరీ ఉగ్రవాదులకు అండగా నిలబడడం దౌర్భాగ్యం. ఉగ్రవాదుల పీడ వదిలించుకోలేని పాక్ ఆర్థికంగా పతనావస్థకు చేరింది. పాక్‌లో అంతర్గత సంక్షోభం విభజన దశకు చేరుకుంది. తన ఇంటిని చక్కదిద్దుకోలేని పాక్ భారత్‌ను నాశనం చేయాలను కోవడం దుర్మార్గమైన చర్య. వ్యక్తులను, వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక మూలాలను ధ్వంసం చేయడమే కాకుండా అమాయక ప్రజల ప్రాణాలను అలవోకగా బలితీసుకుంటూ, నిరంతరం అశాంతిని ప్రజ్వలింపచేస్తూ ఆయా దేశాలను ఆక్రమించుకోవడమో, తమ కనుసన్నల్లో మసలుకునేటట్టు చేయడమో కొన్ని దేశాలకు నిత్యకృత్యంలా మారింది. మానవత్వం నశించిన కరడుగట్టిన పైశాచిక వాదులను సమూహాలుగా ఏర్పాటు చేసి, ఇతర దేశాల్లో మారణహోమం సృష్టించడమే ధ్యేయంగా ఏర్పాటయిన విధ్వంసకారక సంస్థలే ఉగ్రవాద సంస్థలు. ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో అశాంతిని సృష్టించే సామ్రాజ్యవాద శక్తులు ఒకవైపు, అకారణ కలహాలతో నిరంతరం ప్రజల ప్రాణాలను బలితీసుకుంటూ, ఏదో సాధించాలన్న తపనతో మానవత్వాన్ని మంటగలిపి, ఆ మంటల్లో చలికాచుకునే పైశాచికత్వం మరోవైపు ప్రపంచంలో ప్రబలిపోతుండడం విచారకరం. మానవత్వపు ఛాయలు విచ్ఛిన్నకారుల మనస్సుల్లో మచ్చుకైనా కానరావు. కరడుగట్టిన రాక్షసత్వమే నైజంగా బతికే ఉగ్రవాదులను విప్లవకారులుగా, సంస్కర్తలుగా కీర్తించే దేశాలను, ఉగ్రమూకలకు వత్తాసు పలుకుతూ, వారు సాగించే ఘోర హింసాకాండకు ఆర్థికంగా, నైతికంగా సహకరించే దేశాల అనైతిక పోకడలను వర్ణింపతరం కాదు. మతమౌఢ్యవాదంతోనో, సామ్రాజ్యవాదంతోనో, స్వేచ్ఛ పేరుతోనో అమాయకుల కుత్తుకలను ఖండించే దుశ్చర్యలకు పాల్పడే కర్కశవాదం నుండి పుట్టిన ఉగ్రవాదాన్ని కూకటివ్రేళ్ళతో పెకలించాయి. చాలామంది ఉగ్రవాదులకు తాము సాగిస్తున్న మారణ కాండకు సంబంధించి సహేతుకమైన కారణం కనిపించదు. ఉగ్రవాదం కూడా కొంత మందికి ఉపాధినిచ్చే ముడిసరుకుగా మారడం అత్యంతహేయం, అమానవీయం. అశాంతిని సృష్టించడం వలన సాధించేదేమీ ఉండదన్న నగ్నసత్యం ఇప్పటి వరకూ జరిగిన మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ ఫలితాలు నిరూపించాయి. అమాయకుల ప్రాణాలు బలికావడం తప్ప ఉగ్రవాదుల దుశ్చర్యల వలన ఒనగూడే ప్రయోజనం శూన్యమని ప్రపంచంలో అనేక విధ్వంసాలు సృష్టించి తెరమరుగైన ఉగ్రవాద సంస్థల దృష్టాంతాలను గమనించాలి. భారత దేశం శాంతి కాముక దేశం. ఈ శాంతి వచనాల వల్ల ఇప్పటికే దేశం ఎంతో కోల్పోయింది. భవిష్యత్తులో మన దేశం ఇలాంటి శాంతి వచనాలు వల్లించడానికి సంసిద్ధంగా లేదు. వ్యూహానికి ప్రతివ్యూహం.. దెబ్బకుఎదురుదెబ్బ అన్నట్టుగా ముందుకు సాగితేనే శత్రుదేశాలు దారిలోకి వస్తాయి. చాలా కాలం నుండి మన దేశం అగ్రరాజ్యాల ఒత్తిడి వలనో, ఐక్యరాజ్య సమితి హితవచనాలు పాటించడం వలనో పొరుగు దేశాలు మన దేశాన్ని అనేక ఇబ్బందులకు గురిచేసాయి. ఎంతో మంది భారతీయ ముద్దుబిడ్డలు ఈ దేశ సమైక్యత కోసం బలి దానం గావించబడ్డారు. వారి రక్తతర్పణం వృథాగా పోలేదు. చనిపోయిన వీరుల త్యాగ ఫలం వలనే భారత దేశం సమైక్యంగా మనగలుగుతున్నది. భారత ప్రభుత్వం రాజీవ్ గాంధీ ప్రాణత్యాగం చేసిన మే 21 వ తేదీని ప్రతీ ఏటా 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం' గా పాటిస్తూ ఉగ్రవాదంపై అలుపెరుగని పోరు సాగిస్తున్నది.

# సుమధుర గాయకుడు ఎంఎస్


"శ్రీ హనుమాన్ గురుదేవులు నా యెద పలికిన సీతా రామ కథ....నే పలికెద సీతా రామ కథ"... ఎమ్మెస్ రామారావు సుమధుర కంఠం నుండి జాలువారిన సుందరాకాండ వినని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హనుమాన్ జయంతి, శ్రీరామ నవమి నేపథ్యంలో, హనుమాన్ మండల దీక్షలు, రామ నవరాత్రుల సందర్భంగా ఎక్కడ విన్నా సుందరాకాండ వినిపించడం సర్వసాధారణమే. అంతేకాక, ఆంజనే య, రామాలయాలలో నిరంతరం మైకుల ద్వారా రామారావు గానం చేసిన సుందరాకాండ ప్రతిధ్వనించడం కద్దు. మోపర్తి సీతారామారావు అంటే ఎవరో చాలామందికి వెంటనే స్ఫురించక పోవచ్చును. కాని ఎం.ఎస్.రామారావు అనగానే తెలుగు సినిమాల తొలి నేపథ్య గాయకునిగా సంగీతాభిమానులకు, పాతతరం సినీ ప్రేక్షకులకూ ఆయన గుర్తుంటారు. సుందరదాసు' అనగానే ఆయన యావత్ తెలుగు ప్రజలందరికీ సుపరిచితులు, సుప్రసిద్ధులు. ఆయన రచించి, సంగీతం సమకూర్చి గానం చేసిన 'సుందరకాండ' గీతాలు యావదాంధ్ర దేశంలోనూ మారు మ్రోగాయి. మారు మ్రోగుతున్నాయి. ఇంకా మారు మ్రోగుతూనే ఉంటాయి. రామాయణంలోని మధురమైన 'సుందరకాండ' కథను, తేట తెలుగులో, మృదు మధురమైన శైలిలో ఆయన పాడిన తీరు అసమానం, అపూర్వం, అద్వితీ యం. ఇలా మూడు విధాలుగా స్వీయ రచన గావించి, సంగీతం సమకూర్చి, స్వయంగా గానం చేసిన అసమాన ప్రతిభాశాలి ఎమ్మెస్ రామారావుకు ముందు మరొక లేరనడం అతిశయోక్తి కాదు. ఆయనకు "సుందర దాసు" అనే బిరుదు ఉంది. గేయ రూపంలో రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము "ఎమ్మెస్ రామారావు సుందరకాండ" గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఆ రెండూ ఆయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఎమ్మెస్ రామారావు (మోపర్తి సీతారామారావు) 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య, మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఈయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత




పాఠశాలలో, గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచు కున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అనే ఎంకి పాట పాడించా రు. ఆ చిత్రంలో కథా నాయకుని పాత్ర పోషించిన సి.హెచ్. నారాయణరావుకు పాడారు. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. అలా తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకులుగా గుర్తింపు పొందారు. తరువాత ఎమ్మెస్ దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసించి న ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చు కున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది. 1963 సంవత్సరాం తంలో మద్రాసు వదిలి వెళ్లి, రాజమండ్రి చేరుకుని 1974 వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్ లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగులోనికి అనువ దించారు, తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయ రచన చేశాడు. 1975 నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్స రంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరాబా దులో తుది శ్వాస విడిచారు.

# దళిత జనబాంధవుడు భాగ్యరెడ్డి వర్మ

అంటరాని తనంపై ఆయన అలు పెరుగని పోరాటం చేశాడు. బాబా సాహెబ్ అంబేద్కర్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. జాతిపిత మహాత్మునిచే గౌరవింప బడినాడు. తాను నమ్మిన సత్యాలను అందరికీ తెలిపి సమాజంలో చైతన్యం తేవడానికి నిస్వార్థసేవ చేశాడు. దళిత స్త్రీల స్థాయిని దిగజార్చి, దేవాలయాల్లో దేవతలకు అంకితమైన అవివాహిత మహిళలు దేవదాసీలుగా, జోగినులుగా, పార్వతు లుగా, జీవితాలను అంకితం చేసే జోగినీ వ్యవస్థ రద్దు, బాల్య వివాహాల వ్యతిరేకత, దళితులలో విద్యా వ్యాప్తి, అసమానత లేని సమాజం కోసం అవిశ్రాంత కృషి చేశాడు. మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందు వులం..' అని గర్వంగా చాటాడు. అంటరాని వారుగా దూరంగా ఉంచ బడిన వారిని "ఆది హిందువులు"గా భారత దేశంలో తొట్టతొలుత నివసించిన సంతతిగా ఆయన నొక్కి చెప్పాడు. నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో దళితో ద్యమానికి బాటలు వేసిన ఆ మహానేతనే భాగ్యరెడ్డి వర్మ. హరిజన పదం తెలంగా ణ ప్రాంతంలో వ్యాప్తిలో లేని కాలంలో ఆది హిందువు లుగా, ఆది ఆంధ్రులుగా, ఆది భారతీయులుగా నిమ్నవర్గ ప్రజలు తమను తాము ప్రకటించు కోవాలని కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు, మాడపాటి హనుమంతరావుల సహకారంతో భాగ్యరెడ్డి వర్మ ప్రచారం చేశాడు. భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ సంస్థానానికే పరిమితం కాక, తెలుగు నేలపై పలు ప్రాంతాలకూ విస్తరించాడు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22, 1888 – ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్క ర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. హైదరాబాదు సంస్థా నంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్ర మండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరా బాదు ప్రాంతంలో సంఘ సంస్కర ణలకై కృషి చేశాడు. మాదరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు 1888 సంవత్సరం, మే 22వ తేదీన జన్మించిన భాగ య్యకు, 1888 నవంబరులో వారి కుటుంబ గురువు భాగయ్యకు బదులు భాగ్యరెడ్డి అని నామ కరణం చేశాడు. ఆయన కుల శైవమత గురువు బోధనలు చేసేవారు. ఆర్యులు హిందూ దేశానికి వలస రాకముందు, అస్పృశ్యులుగా సమాజంచే ముద్ర వేయబడిన ఆది హిందువులే పాలకులని గురువు వాదం. "రెడ్డి" అన్నది పాలకుడనే అర్థం గల "రేడు" అనే పదం నుంచి ఉద్భవించిందని, అందుచేతనే మాదిరి వెంకయ్యగారి భాగ్యయ్యకు రెడ్డిని జత చేశానని ఆయన చెప్పారు. ఆ తర్వాత 1913లో మాదిరి భాగ్యరెడ్డి హిందూ సమాజానికి చేసిన అపూర్వ సేవలకు గుర్తింపుగా ఆర్య సమాజ్ "వర్మ" అనే బిరుదు ప్రదానం చేశారు. ఆనాటి నుండి బాగయ్య భాగ్యరెడ్డిగా మారి, మాదిరి భాగ్యరెడ్డి వర్మగా,



ఎం.వి. భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధికెక్కాడు. 1913లో 'ఆర్య సమాజ్' ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ప్రధానం చేశారు. దాంతో ఆయన భాగ్యరెడ్డి వర్మగా గుర్తింపు పొందాడు. భాగ్యరెడ్డి 1906లో షెడ్యూల్డు కులాల బాల బాలికల విద్య కోసం హైదరాబాదు లోని ఈసామియా బజారులో జగన్మిత్ర మండలిని స్థాపించాడు. హరిజనులలో విద్యావశ్యకతను గుర్తించి 1910లో జగన్మిత్ర మండలి ఆధ్వర్యంలో మొదటి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాడు. భాగ్యరెడ్డి వర్మ అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్య సంఘాన్ని ఏర్పాటు చేసి, జగన్మిత్ర మండలి కార్యకలాపాలు మన్య సంఘం ద్వారా కొన సాగించాడు. మన్య సంఘం అంటరాని కులాల ప్రజల్లో చైతన్యం తీసుకు రావటానికి ప్రయత్నించింది. కొంతమంది ఉన్నత కులాల హిందువులు కూడా ఈ భజన మండళ్లను ప్రోత్సహించారు. మన్య సంఘం ఆధ్వర్యంలో ఈ భజన మండళ్లు రీడింగ్ రూములు ఏర్పరచి అందులో ఆంధ్రప్రత్రిక, దీనబంధు మొదలైన పత్రికలను అందుబాటులో ఉంచాయి. ప్రదానంగా దళిత మహిళను, ఆ తర్వాత వెనకబడిన తరగతులకు చెందిన యువతులను ప్రత్యేకంగా దేవునికి అంకితమిచ్చే కార్యక్రమాలు న్జెజాం రాజ్యం లోని తెలంగాణ, మరట్వాడా, కన్నడ ప్రాంతాల్లో పురోహితులనబడే జంగాలు నిర్వహించేవారు. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి భాగ్యరెడ్డి వర్మ దూరదృష్టితో కార్యాచరణ చేపట్టాడు. ఆయన కృషివల్ల నిజాం దేవదాసి వ్యవస్థను నిర్మూలించాడు. 1917లో బెజవాడలో జరిగిన తొలి పంచమ మహా సభకు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించాడు. ఈ మహాసభలో ఆయన ప్రసంగానికి ప్రభావితుల్కైన నిర్వాహకులు "ఆంధ్రదేశ తొలి ఆది ఆంధ్ర మహాసభ"గా పేరు మార్చారు. తర్వాత 1919లో బందరులో, 1921లో ఏలూరు, భీమవరం, 1925లో అనంతపూర్, 1933లో నాగపూర్, 1938లో కాకినాడ తదితర చోట్ల జరిగిన ఆది ఆంధ్ర మహాసభలకు అధ్యక్షత వహించాడు. 1917లో విజయవాడలో ఆంధ్ర పంచమ మహాజన సభలో, భాగ్యరెడ్డి వర్మ, ఏ హిందూ పురాణేతిహాసాల్లోనూ పంచము లనే పదం లేదని, ఈ ప్రాంతానికి మొట్ట మొదటి నుండి స్థానికులైన ప్రజలు పంచములే కాబట్టి, ఆది ఆంధ్రులనే వ్యవహారం సరైనదని తీర్మానించాడు. 1917 నుండి 1938 వరకు ఆది ఆంధ్ర మహా సభలు దాదాపు ప్రతి ఏటా జరిగాయి. అంటరాని వారిని ఆది హిందువులుగా పిలవాలని డిమాండు చేశారు. ఈ ఆది ఆంధ్ర మహాజన సభల ప్రభావంతో 1931 జనాభా లెక్కలలో మాల, మాదిగ, ధేర్, చమర్ లాంటి వారికి నిజాం ప్రభుత్వం ఆది హిందువులుగా పేర్కొన్నది. 1933 కల్లా ఆది – హిందూ సోషల్ సర్వీసు లీగు ఆధ్వర్యంలో 26 పాఠశాలలు ప్రారంభ మయ్యాయి. వీటిలో దాదాపు 2600 మంది విద్యార్థులకు చదువు చెప్పేవారు. భాగ్యరెడ్డి వర్మకు హిందూమతంపై విశ్వాసం లేక మొదట్లో అర్య సమాజం, బ్రహ్మసమాజం బోధనలను పాటించేవాడు. తర్వాత బౌద్ధం పట్ల ఆకర్షితు డయ్యాడు. గౌతమ బుద్ధుడు ప్రవచించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ మొదలైన అంశాల పట్ల ఆకర్షితుడయ్యాడు. 1913 నుండి ప్రతి వైశాఖ పూర్ణిమ రోజున బుద్ధ జయంతిని జరుపు కొనే వాడు. తన ఏకైక కుమారునికి గౌతమ్ అని పేరు పెట్టుకున్నాడు. 1917 డిసెంబర్ 15వ తేదీన కలకత్తాలో మహాత్మా గాంధీ పాల్గొన్న "అఖిల భారత హిందూ సంస్కరణ మహాసభ"లో భాగ్యరెడ్డి వర్మ కూడా పాల్గొని, అనర్గళంగా, అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా చేసిన ప్రసంగం గాంధీజీని సైతం ఆకర్షించింది. మరునాట కలకత్తాలో మహాత్మా గాంధీ అధ్యక్షతన మరో సమావేశంలో పాల్గొనడానికి భాగ్య రెడ్డిని ఆహ్వానించి, వేదిక మీదకు తీసుకు రావడానికి తన ప్రైవేట్ కార్యదర్శిని పంపి, భాగ్యరెడ్డిని, గాంధీజీ తన ప్రక్కన కూర్చో బెట్టు కోవడాన్ని బట్టి ఆయన పట్ల గాంధీకి ఎంత గౌరవమో స్పష్ట మౌతున్నది. భాగ్యరెడ్డి వర్మ దళితుల నుద్దేశించి...'దళితులే ఈ దేశపు మూల వాసులు. అవిద్య, అజ్ఞానం వల్ల మాత్రమే దళితులు వెనకబడి ఉన్నారు" అని ఆయన బోధించే వారట. దక్కన్‌లో భాగ్యరెడ్డి వర్మ నిర్మించిన ఆదిజన ఉద్యమం దేశవ్యాపితంగా నడిచిన ఆదిజన మూలవాసీ ఉద్యమానికి అనుసంధాన కర్తగా పనిచేసింది. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన భాగ్య నగర్ అనే పత్రికలో సాహిత్యంలో తొలిసారిగా తాను రాసిన నవల వెట్టి మాదిగ సాహిత్యాన్ని తానే తొలిసారి ప్రచురించాడు. అస్పృశ్యతా నివారణకు భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషికి, గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఇసామియా బజార్ ప్రధాన రోడ్‌కు 'భాగ్యరెడ్డి వర్మ మార్గ్' అని నగర పాలక సంస్థ దేశ స్వాతంత్ర్యాని కంటే ముందే నామకరణం చేయడం విశేషం. భాగ్య రెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో హైదరా బాదులో మరణించాడు.

## భారతీయ పునరుజ్జీవన పితామహుడు

భారత సంఘ సంస్కరణల చరిత్ర లోనే రామ్మోహన్ రాయ్ పేరు, సతీ సహగమనాన్ని రూపుమాపడంతో ముడిపడి చిరస్థాయిగా నిలిచి పోయారు. రామ్మోహన్ రాయ్, హిందూ పూజారుల అధికారాన్ని ధిక్కరించి, ఆ కాలములో సాధార ణమైన బహు భార్యత్వం నేరమని జనులకు నచ్చ చెప్పారు. రాజా రామ్మోహన్ రాయ్ ఆధునిక భారత పితామహుడు, పయనీర్ ఆఫ్ ఇండియా జర్నలిజం, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవన పితా మహుడు, ఆధునిక భారత నిర్మాత. రామ్మోహన్ రాయ్ (మే 22, 1772 – సెప్టెంబరు 27, 1833) భారత దేశంలో మొదటి సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలను ప్రారంభించారు. ఆయన విశేష ప్రభావం రాజకీయ, ప్రభుత్వ నిర్వహణ, విద్యా రంగాల లోనే కాకుండా హిందూమతం పైన కూడా కనపడుతుంది. ఉపనిషత్తు ల్లోని నిరాకార తత్వాన్ని అంగీకరిం చి, మనవ సమాజంలో ఐక్యతను ఆకాంక్షించారు. అస్పృశ్యత, కులజాడ్యం పై చైతన్యం కలిగిం చారు. బ్రిటీష్ ప్రభుత్వం ద్వారా సతీసహ గమనాన్ని నిషేధిం చారు. వితంతు పునర్వివాహం, మహిళల కు ఆస్తి హక్కుల కోసం అతను పోరాడారు. అందరికీ విద్య ముఖ్యంగా స్త్రీ విద్య వల్ల దేశం పురోగతి మారుతుందని నమ్మారు. బాల్య వివాహ రద్దు చట్టం తెచ్చా రు. వితంతు పునర్వివాహాలు కోసం కృషి చేశారు, స్త్రీ పురుషులకు సమాన హక్కులు కోసం గట్టిగా పోరాడారు. ముఖ్యంగా ఆంగ్ల విద్యకు అనుకూలంగా ఉండి, దేశంలో ఆంగ్ల విద్యావిధానానికి కృషిచేశారు. రాజా రామ్మోహన్ రాయ్ బెంగాల్ లోని రాయ్ రాధా నగర్ లో 1772 మే 2 న జన్మించారు. ఆయన తండ్రి రమాకాంత్ వైష్ణవుడు, కాగా తల్లి తరిణి శాక్త మతానికి చెందింది. రామ్మోహన్ బెంగాలీ, పర్షియన్, అరబిక్, సంస్కృత భాషలను పదిహేనో యేడు వరకు అభ్యసిం చారు.


## మజ్జిగ తాగితే మంచిదే కానీ.. వీళ్లకు మాత్రం విషమే..!



వేసవి ఎండల నుంచి శరీరాన్ని చల్లబరిచే అద్భుతమైన పానీయం మజ్జిగ. మజ్జిగ ఒక పోషకమైన పానీయం మాత్రమే కాదు.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంది.. ఇది మంచి జీర్ణక్రియను నిర్వహించేటప్పుడు శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి సహాయపడుతుంది. వేసవి తాపం నుంచి శరీరానికి చల్లదనం ఇస్తుంది. కానీ, పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు నిండివున్న మజ్జిగ కొందరికి మాత్రం అనారోగ్యాన్ని కలిగిస్తుంది. ఇలాంటి వారు మజ్జిగ తాగడం వల్ల ప్రయోజనం ఉండదు. లాక్టోస్ అసహనం ఉన్నవారు మజ్జిగ తాగకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. లాక్టోస్ అసహనం అనేది పాలలో ఉన్న లాక్టోస్‌ను శరీరం జీర్ణించుకోలేకుండా చేస్తుంది. లాక్టోస్ అసహనం ఉన్నవారికి వారి శరీరంలో లాక్టోస్‌ను జీర్ణం చేయడానికి అవసరమైన ఎంజైమ్ లాక్టేజ్ ఉండదు. అలాంటి వారు మజ్జిగ తాగితే కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, గ్యాస్, విరేచనాలు వంటి సమస్యలను ఎదుర్కొంటారని నిపుణులు చెబుతున్నారు. ఇకపోతే, కొందరిలో పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవటం వల్ల ఇబ్బందులు పడుతుంటారు. పాలు లేదా పాల ఉత్పత్తులకు అలెర్జీ ఉన్నవారికి మజ్జిగ తాగడం వల్ల కూడా అలెర్జీ ప్రతిచర్య ఉండవచ్చు. అలాంటి వారికి మజ్జిగ సరిపడదు. వీరు మజ్జిగ తాగడం వల్ల చర్మంపై దద్దుర్లు, దురదలు, శ్వాస ఆడకపోవడం, శరీరంలో వాపు వంటి సమస్యలు వస్తుంటాయని అంటున్నారు. అలాగే, ఆయుర్వేదం ప్రకారం మజ్జిగ జలుబు ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఇది ఛాతీలో కఫం పేరుకుపోయే సమస్యను పెంచుతుంది. జలుబు లేదా దగ్గుతో ఇబ్బంది పడుతున్నవారు మజ్జిగ తీసుకోవడం వల్ల లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. కీళ్ల నొప్పులతో బాధపడేవారు కూడా మజ్జిగను ఎక్కువగా తీసుకోవటం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు కూడా మజ్జిగ తీసుకోవటం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. మజ్జిగలో ఉండే పొటాషియం, సోడియం పరిమాణం అధికంగా ఉంటుంది. మజ్జిగ తీసుకోవడం తీవ్రమైన మూత్రపిండాల సమస్యలతో బాధపడేవారికి హానికరం. అలాంటి వారు వైద్యులను సంప్రదించిన తర్వాతే మజ్జిగ తీసుకోవాలి. కొందరిలో బలహీనమైన జీర్ణవ్యవస్థత ఉంటుంది. అలాంటివారు కూడా మజ్జిగ ఎక్కువ తాగడం మంచిది కాదు. లేదంటే, మజ్జిగ తాగిన తర్వాత అజీర్తి, కడుపు తిమ్మిరి లేదా అసౌకర్యాన్ని అనుభవించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మీకు దీర్ఘకాలిక అనారోగ్యం లేదా అలెర్జీ ఉంటే, మజ్జిగ తాగే ముందు వైద్యులను సంప్రదించడం ఉత్తమం అంటున్నారు నిపుణులు.

# రోజూ వాకింగ్ చేస్తున్నారా?



నడక ఒత్తిడిని తగ్గిస్తుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా రోజూ 45-60 నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు నడవడం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వారానికి కనీసం 300 నిమిషాలు అంటే 5 గంటలు చురుకుగా ఉండటం ద్వారా మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం సరైన ఆహారంతో పాటు తగినంత శారీరక శ్రమ కూడా తప్పనిసరి అని వైద్యులు తరచూ చెబుతుంటారు. అందుకే ప్రస్తుతం చాలా మంది వాకింగ్‌ను ఎంచుకుంటున్నారు. వ్యాయామం చేయలేకపోయినా, పరిగెత్త లేకపోయినా కొన్ని నిమిషాలు నడవడం వల్ల మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. వాకింగ్ చేయడం చాలా ఈజీ.. నడకకు ఎక్కువ శ్రమ లేదా సమయం అవసరం లేదు. అయితే, మీరు రోజుకు ఎంత సేపు నడుస్తున్నారో ఎప్పుడైనా గమనించారా..? ఎంత సమయం వాకింగ్ చేయటం ఆరోగ్యానికి మంచిదో ఇక్కడ తెలుసుకుందాం.. రోజూ వాకింగ్ చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. దీర్ఘకాలంలో ఎంతో మేలు జరుగుతుంది. బరువు తగ్గేందుకు కూడా వాకింగ్ బెస్ట్ ఆప్షన్. డయాబెటిస్, బీపీ తగ్గించడంలో కూడా వాకింగ్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. రోజూ నడక వల్ల గుండె ఆరోగ్యం మెరగవుతుంది. నడక రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. అయితే, రోజువారీ వాకింగ్ వ్యక్తిగత ఆరోగ్యం, ఫిట్‌నెస్ స్థాయి, జీవనశైలి కారకాల ఆధారంగా మారుతుంది. సాధారణ ఆరోగ్య ప్రయోజనాల కోసం, వారంలో.. చాలా రోజులు కనీసం 30 నిమిషాల పాటు బ్రిస్క్ వాక్ లక్ష్యంగా పెట్టుకోవాలని నిపుణులు చెబుతున్నారు. నడకను మన దినచర్యలో భాగం చేసుకోవటం వల్ల మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు అంటున్నారు నిపు ణులు. నడకతో పాటుగా చిన్నపాటి వ్యాయామాలతో శరీరాన్ని సాగదీయడం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. వాకింగ్‌తో కేలరీలను బర్న్ చేయడంలో, ఆరోగ్యకరమైన బరు వును నిర్వహించడంలో సహాయపడుతుంది. మీ కండరాలను బలోపేతం చేస్తుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నడవడం, లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఎక్కడం లేదా భోజన విరామ సమయంలో నడకకు వెళ్లడం మీ దినచర్యలో భాగం చేసుకోవ టం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడిని తగ్గిస్తుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా రోజూ 45-60 నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు నడవ డం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వారానికి కనీ సం 300 నిమిషాలు అంటే 5 గంటలు చురుకుగా ఉండటం ద్వారా మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# మునగ ఆకులతో ఇంత మ్యాజిక్ ఉందా?

బరువు తగ్గాలనుకునేవారికి మునగాకుపొడి మంచిది. గాయలను త్వరగా మానేలా చేయడంలో మునగాకు ముందు వరుసలో ఉంటుంది. మునగాకులో ఐరన్ అధికంగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు రోజూ ఆహారంలో మునగ ఆకును చేర్చుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ గింజల నుంచి తీసిన నూనెను కొన్ని రకాల వ్యాధులను అదుపు చేసేందుకు వాడుతారు. మునగకాయ ప్రయోజనాలు దాదాపు అందరికీ తెలిసిందే..కానీ, మునగ ఆకుల వల్ల కలిగే లాభాలు మాత్రం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. మునగ ఆకుల ప్రయోజనం తెలిస్తే మాత్రం అందరూ వాటి వినియోగాన్ని మొదలుపెట్టడం ఖాయమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మునగ ఆకు ప్రయోజనాలు, ఆరోగ్య లాభాలేంటో తెలిస్తే చిన్న రెమ్మ కూడా వదిలకుండా దాచుకుంటారు..ఎందుకంటే.. మునగ ఆకులో విటమిన్లతోపాటుగా లవణాలు, యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. పోషకలేమితో బాధపడేవారికి మునగ ఔషధం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మునగాకులో ఉండే 46 రకాల సహజ యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను, కాలేయ సంబంధ వ్యాధులు, అల్జీమర్స్‌ను అదుపు చేస్తాయి. కీళ్లనొప్పులు తగ్గించడంలోనూ మునగాకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి మునగాకుపొడి మంచిది. గాయలను త్వరగా మానేలా చేయడంలో మునగాకు ముందు వరుసలో ఉంటుంది. మునగాకులో ఐరన్ అధికంగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు రోజూ ఆహారంలో మునగ ఆకును చేర్చుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మునగాకు జీర్ణక్రియకు సాయపడుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడలోనూ ఉపయోగపడుతుంది. మునగ కాయ, ఆకు మాత్రమే కాదు..




ఎండిన మునగ గింజల పొడి శరీరంలోని మలినాలను తొలగించేందుకు ఉపయోగపడుతుంది. ఈ గింజల నుంచి తీసిన నూనెను కొన్ని రకాల వ్యాధులను అదుపు చేసేందుకు వాడుతారు.

## పచ్చిమిర్చి పక్కకు పెట్టేస్తున్నారా..

పచ్చిమిర్చి ఆహారానికి రుచిని జోడించడమే కాదు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. పచ్చి మిర్చిలో అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచడంతో పాటు అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. పచ్చి మిరపకాయలు ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉన్నాయి. పచ్చి మిరపకాయలలో విటమిన్ సి, విటమిన్ ఎ, బీటా కెరోటిన్, ఐరన్ , పొటాషియం వంటి మూలకాలు పుష్కలంగా లభిస్తాయి. దీనితో పాటు ఇందులో "క్యాప్సైసిన్" అనే ప్రత్యేక మూలకం ఉంటుంది. దీని కారణంగానే పచ్చి మిరపకాయ కారంగా ఉంటుంది. ఈ క్యాప్సైసిన్ మన శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. పచ్చి మిరపకాయల్లో ఉండే క్యాప్సైసిన్ గుండె ఆరోగ్యానికి మంచిదని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. మంచి కొలెస్ట్రాల్‌ను నిర్వహించడంలో సహాయపడుతుంది. అదనంగా ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్త ధమనులలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుంది. దీనివల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. అంతేకాదు పచ్చి మిరపకాయలలో యాంటీ-ఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి శరీరంలో మంటను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తుంది. క్యాన్సర్‌తో పోరాడడంలో సహాయపడుతుంది. పచ్చిమిర్చి గుండె సంబంధిత సమస్యలతో పోరాడటమే కాదు క్యాన్సర్ వంటి వ్యాధులతో పోరాడటంలో కూడా సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడానికి పనిచేస్తాయి. ఫ్రీ రాడికల్స్ అనేవి కణాలను దెబ్బతీయడం ద్వారా క్యాన్సర్‌కు కారణమయ్యే హానికరమైన కారకాలు. పచ్చి మిరపకాయలలో లభించే క్యాప్సైసిన్ కొన్ని రకాల క్యాన్సర్ కణాలు పెరగకుండా నిరోధిస్తుంది. ముఖ్యంగా ప్రోస్టేట్, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల నివారణలో పచ్చి మిర్చి ప్రయోజనాలు అధికం.



## యవ్వనంగా కనిపించాలనుకుంటున్నారా?



చాలా మంది కూల్ వాటర్ ఎక్కువగా తాగుతుంటారు.. కానీ, ఇది సరైనది కాదు.. చాలా చల్లని లేదా వేడి నీరు చర్మానికి మంచి కంటే చెడే ఎక్కువ చేస్తుందిని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం గోరువెచ్చని లేదంటే గది ఉష్ణోగ్రత నీటిని తీసుకోవడం వల్ల పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది. తిన్న వెంటనే నీళ్లు తాగకూడదని చెబుతున్నారు.. దీనివల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. నీళ్లు శరీరానికి ఎంతో అవసరం. ముఖ్యంగా ఎండాకాలంలో మరీ ఎక్కువ నీళ్లు తాగుతాం.. అయితే ఈ నీటిని సరైన విధానంలో తాగితే యవ్వనంగా కూడా ఉంటామని మీకు తెలుసా..?ఆశ్చర్యంగా ఉంది కదూ..కానీ, ఇదే నిజం అంటున్నారు నిపుణులు. నీళ్లు తాగడమే కాదు.. దానిని సరైన పద్ధతి ప్రకారం తీసుకుంటే మీరు 40 ఏళ్ల వయసులోనూ 20 ఏళ్ల చిన్నవారిలా కనబడతారని అంటున్నారు. ఉదయం నిద్ర లేవగానే ఒక పెద్ద గ్లాసులో గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇది ఆరోగ్యానికి, శరీరానికి చాలా మంచిదని చెబుతున్నారు. రాత్రంతా శరీరం డిటాక్స్ మోడ్‌లో ఉంటుంది. ఒంట్లో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపడానికి నీళ్లు చాలా అవసరం. నెమ్మదిగా నీరు తాగడం వల్ల మెరిసే చర్మం మీ సొంతమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీటిని రోజుకు ఒక్కసారైనా తాగాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, రాగి సహజ యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుందని చెబుతున్నారు. ఇది శరీరంలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలను పెంచుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శరీరం, కడుపులో మంటను తగ్గిస్తుంది. చర్మానికి సహజమైన మెరుపుని ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. నీటిలో పుదీనా, నిమ్మకాయ, దోసకాయ లేదా కొన్ని బెర్రీ ముక్కలను కలిపి 'డిటాక్స్ వాటర్' తయారు చేసుకుని కూడా తీసుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఈ నీటిలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు మీ ముఖం కాంతిని తిరిగి తీసుకురావడానికి దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. నీటిని ఒకేసారి ఎక్కువ మొత్తంలో కాకుండా రోజంతా కొద్దికొద్దిగా తీసుకుంటూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల రక్త ప్రసరణ బాగుంటుంది. ఇది చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని అంటున్నారు. చాలా మంది కూల్ వాటర్ ఎక్కువగా తాగుతుంటారు.. కానీ, ఇది సరైనది కాదు.. చాలా చల్లని లేదా వేడి నీరు చర్మానికి మంచి కంటే చెడే ఎక్కువ చేస్తుంది. గోరువెచ్చని లేదా గది ఉష్ణోగ్రత నీరు పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది. తిన్న వెంటనే నీళ్లు తాగకూడదని చెబుతున్నారు.. దీనివల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. ఇక కడుపు ఉబ్బరం వల్ల చర్మం మెరుపు కూడా తగ్గుతుంది.

## బిజినెస్

### పసిడి ప్రియులకు షాక్..



గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే.. నెల క్రితం లక్ష మార్కు దాటేసిన బంగారం ధరలు.. ఆ తర్వాత అంతగా దూకుడు కొనసాగించలేదు. ఆ తర్వాత ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే.. నెల క్రితం లక్ష మార్కు దాటేసిన బంగారం ధరలు.. ఆ తర్వాత అంతగా దూకుడు కొనసాగించలేదు. ఆ తర్వాత ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి.. ఈ క్రమంలోనే మంగళవారం తగ్గిన బంగారం ధరలు.. బుధవారం భారీగా పెరిగాయి.. ఒక్కరోజే పసిడి ధర దాదాపుగా రూ.2400 పెరిగింది. లక్ష మార్కు దాటిన తర్వాత.. నెల వ్యవధిలో ధరలు ఇంతలా పెరగడం ఇదే మొదటిసారి.. బుధవారం బులియన్ మార్కెట్ ప్రకారం..24 క్యారెట్ల పసిడి ధర పది గ్రాములపై రూ.2400 మేర ధర పెరిగి రూ.97,420 గా ఉంది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 2,200 మేర ధ పెరిగి రూ.89,300 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.100 మేర ధర తగ్గి.. రూ.96,900 లుగా ఉంది. హైదరాబాద్ లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 89,300లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.1,07,900లుగా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 89,300లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,07,900లుగా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.89,450, 24 క్యారెట్ల ధర రూ.97,570 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల ధర రూ.97,420 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల రేటు రూ.97,420 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల ధర రూ.97,420 గా ఉంది.

### దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభం



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ సూచీలు రాణిస్తున్నాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో కొనుగోళు సూచీలకు దన్నుగా నిలుస్తుండటంతో మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఈరోజు ఉదయం 9 గంటల 28 నిముషాలకు సెన్సెక్స్ 159 పాయింట్ల లాభంతో 81,345 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 43 పాయింట్ల లాభంతో 24,727 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో %ొ%. సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, బజాజ్‌ఫిన్‌సర్వ్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎంఅండ్‌ఎం, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. ఎటర్నల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్‌ఫైనాన్స్, రిలయన్స్ ఇండిస్టీస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66.39 డాలర్ల వద్ద.. బంగారం ఔన్సు 3,307 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. అయితే అమెరికా మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ 500.. 0.39 శాతం, డోజోన్స్ 0.27 శాతం, నాస్‌డాక్ 0.38 శాతం మేర నష్టపోయాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ఆస్ట్రేలియన్ ఏఎస్ఎక్స్ 0.69 శాతం, షాంఘై 0.38 శాతం, హాంగ్‌సెంగ్ 0.70 శాతం లాభంతో కదలాడుతున్నాయి. ఇక జపాన్ నిక్కీ మాత్రం 0.10 శాతం నష్టంతో కదలాడుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు మంగళవారం నికరంగా రూ.10,016 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.6,738 కోట్ల షేర్లును కొనుగోలు చేశారు.

# అందరికీ నచ్చే కొత్త స్కూటర్



ఆధునిక కాలంలో ఎలక్ట్రిక్ స్కూటర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నప్పటికీ పెట్రోలుతో నడిచే వాహనాలకు డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. మంచి పనితీరుతో ఇవి ప్రజల నమ్మకాన్ని పొందాయి. అలాంటి వాటిలో సుజుకీ యాక్సెస్ స్కూటర్ ఒకటి. ఎలక్ట్రిక్ వాహనాల హవాలోనూ దీని విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైడ్ కనెక్ట్ పేరుతో సుజుకి యాక్సెస్ కొత్త ఎడిషన్ ను విడుదల చేసింది. ఈ స్కూటర్ ప్రత్యేక డిజైన్, ఆకర్షణీయమైన రంగులతో ఆకట్టుకుంటోంది. మన దేశంలో అత్యధికంగా అమ్ముడయ్యే స్కూటర్లలో సుజుకి యాక్సెస్ ఒకటి. దీనిలో కొత్త ఎడిషన్ ను సుజుకి మోటార్ సైకిల్ ఇండియా విడుదల చేసింది. దీని ధరను రూ.1,01,900 (ఎక్స్ షోరూమ్)గా నిర్ణయించారు. 4.2 అంగుళాల కలర్ డీఎఫ్ టీ డిస్ ప్లేలో విజువల్స్ చాలా స్పష్టంగా కనిపిస్తాయి. పెర్ల్ మ్యాట్ ఆక్వా సిల్వర్ అనే కొత్త రంగులో దీన్ని తీసుకువచ్చారు. అలాగే ప్రస్తుతం ఉన్న మోటాలిక్ మ్యాట్ నంబర్ 2, మోటాలిక్ మ్యాట్ స్టెల్లార్ బ్లూ, పెర్ల్ గ్రేస్ వైట్, సాలిడ్ ఐస్ గ్రీన్ అనే రంగుల్లో కూడా అందుబాటులో ఉంది. కొత్త స్కూటర్ లో 124 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఏర్పాటు చేశారు. ఈ కంపెనీకి చెందిన అన్ని 125 మోడళ్లలోనూ దీన్నే వినియోగిస్తున్నారు. ఈ ఇంజిన్ నుంచి 6500 ఆర్పీఎం వద్ద 8.31 బీహెచ్ పీ శక్తి, 5000 ఆర్పీఎం వద్ద 10.2 ఎన్ ఎం గరిష్ట టార్కు విడుదల అవుతుంది. ఇంజిన్ ఫ్యూయల్ ఇంజెక్షన్, సీవీటి ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్, కిక్ - ఎలక్ట్రిక్ స్టార్టర్ తదితర ప్రత్యేకతలు ఉన్నాయి. ఇతర ప్రత్యేకతల్లోకి వెళితే స్కూటర్ ముందు భాగంలో ఎల్ఈడీ హెడ్ ల్యాంప్, వెనుక భాగంలో ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్ ఏర్పాటు చేశారు. వన్ పుష్ సెంట్రల్ లాక్ సిస్టమ్, ఎక్స్ టర్నల్ ఫ్యూయల్ ఫిల్లర్ క్యాప్ ఆకట్టుకుంటున్నాయి. సుజుకీ ఇంజిన్ కిల్ స్విచ్, యూఎస్ బీ పోర్టు, ముందు భాగంలో యుటిలిటీ పాకెట్లు, రెండు హుక్కులు, సీటు కింద రెండు హుక్కులు, స్టోరేజీ తదితర ఫీచర్లు ఆకట్టుకుంటున్నాయి. సుజుకి యాక్సెస్ రైడ్ కనెక్ట్ ఎడిషన్ స్కూటర్ 46 కిలోమీటర్ల మైలేజీ ఇస్తోంది. టెలిస్కోపిక్ యూనిట్లు, వెనుక భాగంలో స్వింగ్ ఆర్మ్ మౌంటెడ్ సస్పెన్షన్, ముందు భాగంలో డ్రమ్, డిస్క్ బ్రేకులు, వెనుక వైపు డ్రమ్ బ్రేకులు అమర్చారు. ఈ స్కూటర్ ఫ్యూయల్ ట్యాంకు కెపాసిటీ 5.3 లీటర్లు. బరువు సుమారు 106 కిలోలు. కాగా.. సుజుకి మోటారు సైకిల్ ఇండియా ప్రైవేటు లిమిటెట్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ ముత్రేజా మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రాకపోకలకు వీలుగా ఉండేలా కొత్త స్కూటర్ ను తయారు చేశామన్నారు. ట్రాఫిక్ రద్దీలోనూ చాలా సులువుగా డ్రైవింగ్ చేసుకోవచ్చు న్నారు. కలర్ టీఎఫ్ టీ డిజిటల్ డిస్ ప్లే, ఆకర్షణీయమైన రంగుతో అందంగా తీర్చిదిద్దాం. విశ్వసనీయత, సౌకర్యం, సామర్థ్యానికి ఈ స్కూటర్ నిదర్శనంగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

# మన ఆర్థిక వ్యవస్థకు ఐక్యరాజ్యసమితి కితాబు



భారతీయులందరూ గర్వపడే ఓ విషయాన్ని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉంటే, భారతదేశం మాత్రం ప్రగతిపథంలో దూసుకుపోతోందని తెలిపింది. ఇది మన పాలకులు, ప్రజలు, వ్యాపారవేత్తల సమర్థతకు నిదర్శనంగా నిలిచింది. ఈ విష యాన్ని ఐక్యరాజ్యసమితి ఓ నివేదికలో వెల్లడించింది. దానిలో మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదలను కొనియాడింది. ఈ నివేది కను ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం (డీఈఎస్ఏ)లోని ఆర్థిక విశ్లేషణ, విధాన విభాగంలోని గ్లోబల్ ఎకనామిక్ మానిటరింగ్ బ్రాంచ్ తయారు చేసింది. ఐక్యరాజ్యసమితి నివేదికలో అనేక విషయాలను వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత దేశ ఆర్థిక వృద్ధిని 6.3 శాతంగా అంచనా వేసింది. ఇది పెద్ద దేశాల ఆర్థిక వ్యవస్థ కంటే అత్యధికమని తెలిపింది. ఈ ప్రగతి 2026 వరకూ కొనసాగుతుందని, మొత్తానికి 6.4 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి 2025లో 2.4 శాతానికి మందగిస్తుం దని అంచనా వేసింది. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. సరిహద్దు వివాదాలు ఎక్కువయ్యాయి. దేశాల విధానాల్లో మార్పులు సంభవించాయి. దీంతో పెట్టుబడుల్లో క్షీణత ఏర్ప డింది. ఇదే సమయంలో భారత దేశంలో అభివృద్ధి గణాం కాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఉత్సాహభరితమైన మూలధన మార్కెట్లు, మంచి ఉత్పత్తులు, రికార్డు స్థాయిలో ఎగుమతులు, బలమైన రక్షణరంగం దీనికి ప్రధాన కారణాలుగా చెబుతు న్నారు. మంచి విధాన ఎంపి కలు, బలమైన దేశీయ డిమాం డ్, స్థిరమైన ప్రభుత్వ వ్యయం కూడా మన ఆర్థిక వృద్ధికి కారణాలని చెప్పవచ్చు. వీటితో ప్రజలకు చక్కని ఉపాధి అవ కాశాలు ఏర్పడుతున్నాయి. అలాగే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి దోహదం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2025 నాటికి ద్రవ్యోల్బణం 4.3 శాతం తగ్గుతుందని అంచనా వేశా రు. మార్కెట్లు కూడా ప్రగతి పథంలో పయని స్తున్నాయి. పె ట్టుబడిదారులకు స్టాక్ లు లాభాలను ఆర్జించిపెడుతున్నాయి.

## ప్లే ఆఫ్స్ బెర్తుకోసం ముంబైతో అమీతుమీ..

# ఢిల్లీ ఆశలన్నీ వీళ్లపైనే!





ఐపీఎల్ 18వ సీజన్‌లో చివరి ప్లే ఆఫ్స్ బెర్తుపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, బెంగళూరు జట్లు నాకౌట్‌కు దూసుకెళ్లగా.. ముంబై ఇండియన్స్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య పోటీ నెలకొంది. ఈ సీజన్‌లో అదరగొడుతున్న ఇరుజట్లు బుధవారం వాంఖడేలో అమీతుమీకి సిద్ధమయ్యాయి. అయితే. వర్షం ముప్పు ఉన్నందున పూర్తిగా 20 ఓవర్ల ఆట సాధ్యమవుతుందా? అనేది సందేహంగా ఉంది. మాజీ ఛాంపియన్ అయిన ముంబై మరోసారి ప్లే ఆఫ్స్‌పై కన్నేయగా.. తొలి టైటిల్ కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ ఎలాగైనా గెలుపొందాలనే కసితో ఉంది. ఈ నేపథ్యలో అక్షర్ పటేల్ బృందం సమిష్టిగా రాణించాలని భావిస్తోంది. ముంబై మాత్రం ఎప్పటిలానే ఓపెనర్లు, సూర్య, తిలక్‌పై.. పేస్ బౌలింగ్ యూనిట్‌పై భరోసా ఉంచుతోంది.

**వాంఖడేలోనే బోణీ**

పద్దెనిమిదో సీజన్‌లో వరుసగా రెండు ఓటములు పలకరించిన వేళ.. వాంఖడేలోనే ముంబై బోణీ కొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతాను ఓడించిన పాండ్యా సేన ఆ తర్వాత ఆర్సీబీ చేతిలో ఓడిపోయింది. అయితే.. ఢిల్లీపై విజయంతో ట్రాక్‌లో పడిన ముంబై.. వరుసగా ఆరు మ్యాచుల్లో జయభేరి మోగించి అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఓపెనర్లు రోహిత్ శర్మ రియాన్ రికెల్టన్ లు శుభారంభాలు ఇస్తుండగా.. మిడిల్ ఓవర్లలో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్యాలు దంచికొడుతున్నారు. ఆపై బుమ్రా, బౌల్ట్, చాహర్‌లు ప్రత్యర్థి బ్యాటర్లను వణికిస్తూ పవర్ ప్లేలోని వికెట్లు తీసి ముంబైకి బ్రేకిస్తున్నారు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా కరణ్ శర్మ మ్యాచ్ విన్నర్‌గా మారడం మాజీ ఛాంపియన్‌ను ప్లే ఆఫ్స్‌కు మరింత చేరువ చేసింది. మంగళవారం కూడా ముంబై టాప్ గన్స్ చెలరేగితే ఢిల్లీ ప్లే ఆఫ్స్ ఆశలు గల్లంతవ్వడం ఖాయం. అయితే.. బ్యాటింగ్‌లో బలంగా కనిపిస్తున్న ఆ జట్టును ముంబై పేసర్లు ఎంతలోపు కట్టడి చేస్తారు? అనేదానిపై పాండ్యా జట్టు గెలుపు అవకాశాలు ఉన్నాయి.

**రాహుల్ సరే.. బౌలింగే సమస్య**

సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో టైటిల్ ఫేవరెట్‌గా మారిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆ తర్వాత తడబడింది. ఓపెనర్‌గా ఒక్క మ్యాచ్‌లోనే ఇరగదీసిన కరుణ్ నాయర్ (%ఖుతీబఅ ఛ్మీఱతీ%) ఆ తర్వాత విఫలమవుతున్నాడు. దాంతో, ఢిల్లీకి శుభారంభం లభించడం పెద్ద సమస్యగా మారింది. అయితే.. మిడిల్ ఓవర్లలో దంచేస్తూ.. ఢిల్లీ పాలిట ట్రబుల్ షూటర్‌లా మారిన కేఎల్ రాహుల్ (%ఖూ ఢ్నష్త్రబశ్రీ%) విధ్వంసక బ్యాటింగ్‌తో అలరిస్తున్నాడు. కుర్రాడు ట్రిస్టన్ స్టబ్స్, ఆశుతోష్ శర్మలు ఫామ్‌లో ఉండడం ఆ జట్టుకు శుభపరిణామం. కానీ, పేస్ బౌలింగ్ యూనిట్ మాత్రం మెరుగవ్వాల్సి ఉంది. ఎందుకంటే.. ఐపీఎల్ వాయిదా పడడంతో మిచెల్ స్టార్క్(%వీఱఱష్ట్రవశ్రీశ్రీ ' స్త్ఖుతీష%) సేవల్ని ఢిల్లీ కోల్పోయింది. పదునైన యార్కర్లు సంధిస్తూ.. బ్యాటర్లను భయపెట్టే ఆ ఆసీస్ స్పీడ్‌స్టర్ లేని లోటు గుజరాత్ మ్యాచ్‌లో కనిపించింది. రాహుల్ సూపర్ సెంచరీతో 219 రన్స్ కొట్టిన అక్షర్ పటేల్ బృందం గెలుపు ఖాయం అనుకుంది. కానీ, స్టార్క్, ముకేశ్ కుమార్‌ల గైర్హాజరీలో గుజరాత్ యువ ఓపెనర్లు సాయిసుదర్శన్, శుభ్‌మన్ గిల్ జోడీని కట్టడి చేసే బౌలర్ కరువయ్యాడు. పేసర్లు ముస్తాఫిజుర్, నటరాజన్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. అక్షర్, కుల్దీప్ సైతం తేలిపోగా.. గుజరాత్ 10 వికెట్ల తేడాతో గెలుపొంది ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఒకవేళ ఈ మ్యాచ్ గెలిస్తే ఢిల్లీ ప్లే ఆఫ్స్ అవకాశాలు మెరుగయ్యేవి. కానీ.. బౌలింగ్‌లో తేలిపోయిన ఢిల్లీ.. చివరి రెండు లీగ్ మ్యాచుల్లో విజయం సాధిస్తేనే ప్లే ఆఫ్స్ చేరుతుంది. అయితే.. వాంఖడేలో ముంబై గెలిచిందంటే అక్షర్ పటేల్ సేన ఇంటిదారి పట్టాల్సిందే. అలా కాకుండా పాండ్యా బృందానికి ఢిల్లీ షాకిస్తే.. ఇరుజట్ల చివరి లీగ్ మ్యాచ్(పంజాబ్ కింగ్స్‌తో)లో గెలుపొందిన జట్టు ప్లే ఆఫ్స్ చేరుకుంటుంది. ఒకవేళ వర్షం అంతరాయం కలిగించకుంటే.. 200 ప్లస్ స్కోర్ నమోదయ్యే అవకాశముంది. అదే జరిగితే.. ఇప్పటివరకూ రెండొందల ప్లస్ కొట్టిన 17 మ్యాచుల్లో ముంబై గెలుపొందింది. 14 పర్యాయాలు 200 ప్లస్ చేసిన ఢిల్లీ 13 మ్యాచుల్లో ప్రత్యర్థికి చెక్ పెట్టింది.

## స్పోర్ట్స్

### ఇంగ్లండ్ తుది జట్టు ప్రకటన



ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికగా జింబాబ్వేతో రేపటి నుండి (మే 22) ప్రారంభం కాబోయే నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్ కోసం ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించారు. ఈ జట్టుకు సారథిగా బెన్ స్టోక్స్ వ్యవహరించనున్నాడు. ఈ మ్యాచ్‌తో ఎసెక్స్ సీమర్ సామ్ కుక్ టెస్ట్ అరంగేట్రం చేయనున్నాడు. ఈ మ్యాచ్‌లో జేమీ స్మిత్ ఇంగ్లండ్ వికెట్‌కీపర్‌గా వ్యవహరించనున్నాడు. యువ స్పిన్నర్ షోయబ్ బషీర్ తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. టాపార్డర్‌లో జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్ కొనసాగనున్నారు. పేస్ విభాగంలో గస్ అట్కిన్సన్, జోష్ టంగ్, సామ్ కుక్ ఉండనున్నారు. ఇంగ్లండ్ జింబాబ్వేతో చివరిసారిగా 2003లో టెస్ట్ మ్యాచ్ ఆడింది. ఇంగ్లండ్ హోం సమ్మర్‌లో ఇదే తొలి టెస్ట్ మ్యాచ్ కానుంది. ఈ టెస్ట్ మ్యాచ్ తర్వాత ఇంగ్లండ్ స్వదేశంలో వెస్టిండీస్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడనుంది. ఈ సిరీస్‌లు మే 29 నుంచి ప్రారంభమవుతాయి. ఈ సిరీస్‌ల్లో మొదటిగా వన్డేలు (3), ఆతర్వాత టీ20లు (3) జరుగనున్నాయి. ఈ సిరీస్‌ల కోసం కూడా ఇంగ్లండ్ జట్టును ఇదివరకే ప్రకటించారు. విండీస్‌తో సిరీస్‌ల తర్వాత ఇంగ్లండ్ స్వదేశంలోనే భారత్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. అనంతరం ఈ ఏడాది నవంబర్‌లో ఇంగ్లండ్ ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌లో తలపడుతుంది. జింబాబ్వేతో టెస్ట్ మ్యాచ్‌కు ఇంగ్లండ్ ప్లేయింగ్ %శ×%: జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్, జేమీ స్మిత్, గస్ అట్కిన్సన్, సామ్ కుక్, జోష్ టంగ్, షోయబ్ బషీర్.





# కిరాతగా మోహన్ లాల్.. స్పెషల్ గ్లింప్స్ అదిరింది!

మోహన్‌లాల్ పుట్టినరోజు (మే 21) సందర్భంగా 'కన్నప్ప' చిత్ర బృందం ఒక అద్భుతమైన స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌లో మోహన్‌లాల్ కిరాత అనే దైవిక శక్తితో ముడిపడిన పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌లో ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, నటన అభిమానులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇక కన్నప్ప విషయానికొస్తే.. విష్ణు మంచు హీరోగా నటించిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, ఆర్.శరత్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, బ్రహ్మానందం ఇతర కీలక పాత్రలు పోషించారు.ఆవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది.

# నుదుట సింధూరం ఎరుపు రంగు చీరలో అదితి..

## కేన్స్‌లో మెరిసిన భారతీయ అందం!



ఫ్రాన్స్ వేదికగా ప్రపంచ ప్రఖ్యాత 77వ కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ప్రపంచ నటీనటులు తమ స్టైల్‌తో ఆకట్టుకుంటుండగా, భారతీయ నటీమణులు తమ సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్‌తో పాటు పలువురు నటిమణులు ఈ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలువగా.. తాజాగా బాలీవుడ్ నటి అదితి రావు హైదరి తన ట్రెడిషనల్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. కేన్స్ రెడ్ కార్పెట్‌పై అదితి రావు హైదరి ఎరుపు రంగు డిజైనర్ చీరలో కనిపించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. ఈ చీరకు తగ్గట్టుగా ఆమె నుదుట సింధూరం ధరించి, సంప్రదాయ భారతీయ వధువులా మెరిసిపోయారు. గోల్డెన్ బ్లౌజ్, నామమాత్రపు ఆభరణాలతో ఆమె లుక్ మరింత ప్రత్యేకంగా నిలిచింది. అదితి ఎంపిక చేసుకున్న ఈ చీర ఆమెకు చక్కగా సెట్ అయ్యింది. ఇక అదితి లుక్‌పై నెటిజన్లు స్పందిస్తూ.. ఎరుపు రంగు చీర, నుదుట సింధూరంతో అదితి అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుందని ప్రశంసిస్తున్నారు. ఆమె ఈ లుక్‌లో భారతీయ సంస్కృతిని కేన్స్ వేదికపై గొప్పగా చాటి చెప్పారని అభిమానులు కొనియాడుతున్నారు. కేన్స్ రెడ్ కార్పెట్‌పై అదితి ప్రదర్శించిన ఈ సంప్రదాయ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# టాలెంట్ ఉన్న యువతకు దిల్ రాజు బంపర్ ఆఫర్!

తెలుగు సినీ పరిశ్రమలో, యావత్ భారతీయ సినీ రంగంలో దిల్ రాజు పేరుకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన మొదటి సినిమా పేరును ఇంటిపేరుగా మార్చుకున్న ఈ నిర్మాత, టాలెంట్‌ను గుర్తించడంలో దిట్ట. ఎంతోమంది హీరోలు, నటీనటులు, దర్శకులు, టెక్నీషియన్లను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేసిన దిల్ రాజు, ఇప్పుడు మరో ముందడుగు వేశారు. తెలుగు సినీ పరిశ్రమకు మరింత టాలెంట్‌ను అందించే ప్రయత్నంలో భాగంగా, ఆయన కొత్త ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేశారు. కొత్త ప్రతిభను సినీ పరిశ్రమకు పరిచయం చేయాలనే లక్ష్యంతో దిల్ రాజు తాజాగా దిల్ రాజు డ్రీమ్స్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించారు. తన కెరీర్ మొదలు నుంచి ఫ్రెష్ కంటెంట్, కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించిన దిల్ రాజు, ఇప్పుడు ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా యువ ప్రతిభావంతులకు అద్భుతమైన అవకాశాలు కల్పించనున్నారు. జూన్ నెల నుంచీ "దిల్ రాజు డ్రీమ్స్" ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో భాగం కావాలనుకునేవారు https://dilrajudreams.com/ లింక్‌పై క్లిక్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపాడు. వివరాలు నమోదు చేసుకున్న తర్వాత, దిల్ రాజు డ్రీమ్స్ బృందం స్వయంగా వారిని సంప్రదిస్తుంది. జూన్‌లో ఈ పోర్టల్ పూర్తిగా సిద్ధమైన తర్వాత, యువ ప్రతిభావంతులు తమ ఆలోచనలను ఈ బృందానికి నేరుగా తెలియజేయవచ్చు. సరైన ప్లాట్‌ఫామ్ దొరకక, సినీ పరిశ్రమలో పరిచయాలు లేక, ఎవరిని ఎలా సంప్రదించాలో తెలియక ఎంతోమంది టాలెంట్ ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారందరికీ ఇది నిజంగా ఒక గోల్డెన్ ఛాన్స్. టాలెంట్ ఉన్నవారు తమను తాము నిరూపించుకోవడానికి దిల్ రాజు స్థాపించినదే ఈ "దిల్ రాజు డ్రీమ్స్.

# తెలుగు సినిమా కోసం 'కాంప్రమైజ్' అవ్వమని చెప్పారు

ఇటీవల కాలంలో సినిమా పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అనే అంశం చాలా హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై సినీ తారలు ఇప్పుడిప్పుడే బహిరంగంగా మాట్లాడుతున్నారు. తమకు ఎదురైన ఛేదు అనుభవాలను పంచుకుంటూ.. వాటిని ఎలా అధిగమించాలో కొత్తతరం నటీనటులకు సలహాలు ఇస్తున్నారు. తాజాగా బాలీవుడ్ హీరోయిన్ సయామీ ఖేర్ కూడా క్యాస్టింగ్ కౌచ్‌పై స్పందించారు. తన కెరీర్ ఆరంభంలో ఓ తెలుగు సినిమా అవకాశం కోసం 'సర్దుకుపోవాలని' అడిగారని, దానికి ఆమె నో చెప్పి.. ఆ సినిమాను వదిలేశానని చెప్పారు. తాజాగా సయామీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నాకు ఇప్పటి వరకు వచ్చిన ఆఫర్ల విషయంలో చాలా హ్యాపీగా ఉన్నాను. మంచి సినిమాల్లో నటించే అవకాశం రావడం నా అదృష్టం. అయితే నా కెరీర్ ఆరంభంలో మాత్రం నాకొక ఛేదు అనుభవం ఎదురైంది. నాకు 19-20 ఏళ్ల వయసులో ఓ తెలుగు సినిమా ఆఫర్ వచ్చింది. ఒక లేడీ ఏజెంట్ నన్ను పిలిచి సినిమా చాన్స్‌ల కోసం 'సర్దుకుపోవాలి' అని చెప్పారు. నేను ఆమెను టెస్ట్ చేయడానికి ప్రయత్నించాను. ఆమె మాటలు అర్థం కానట్లుగా నటించాను. కానీ ఆమె పదే పదే అదే విషయం ప్రస్తావించడంతో 'క్షమించండి, నేను అలాంటి పనులకు దూరంగా ఉంటాను. నాకు కొన్ని పరిమితులు ఉన్నాయి. వాటిని ఎప్పటికీ దాటలేను' అని సున్నితంగా తిరస్కరించాను. అయితే ఆ సమయంలో ఈ విషయాన్ని బయట పెట్టేంత ధైర్యం నాకు లేదు. అందుకే ఆ సినిమాను వదిలేసి నా పని నేను చేసుకుంటూ వెళ్లాను. నా కెరీర్‌లో ఒక్కసారి మాత్రమే 'కమిట్‌మెంట్' లాంటి ఛేదు ఘటన ఎదురైంది' అని సయామీ చెప్పుకొచ్చింది. సయామీ ఖేర్ కెరీర్ విషయానికొస్తే.. 2015లో 'రేయ్' అనే తెలుగు సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయింది. ఆ తర్వాత రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా తీసిన 'మిర్జ్యా' చిత్రంతో సయామి బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.'చోక్డ్' 'ఘూమర్' వంటి చిత్రాలతో పాటు 'స్పెషల్ ఆప్స్', 'ఫాదూ' వంటి వెబ్ సిరీస్‌లు ఆమెకు మంచి గుర్తింపుని తెచ్చిపెట్టాయి. 2021లో అక్కినేని నాగార్జునతో కలిసి నటించిన 'వైల్డ్ డాగ్' మూవీలో సయామీ కీలక పాత్ర పోషించారు. ఇటీవల రిలీజైన'జాట్' సినిమాలో ఎస్పై పాత్రలో కనిపించారు. ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాల్లో నటిస్తునారు.



# విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్దన్'లో కీర్తి సురేష్?



"మహానటి" చిత్రంతో జాతీయ ఉత్తమ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్, తన పాత్రల ఎంపికలో కొత్త ధోరణిని అనుసరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంచుకున్న కీర్తి, ఇప్పుడు తన "వెర్షన్ 2.0?ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పుకు కారణం విజయ్ దేవరకొండతో ఆమె నటించబోయే సినిమా 'రౌడీ జనార్దన్'. తాజా సమాచారం ప్రకారం, రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న 'రౌడీ జనార్దన్' చిత్రంలో కీర్తి సురేష్ రొమాంటిక్ పాత్రలో కనిపించబోతోంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండతో లిప్ లాక్ సన్నివేశాలు కూడా ఉండవచ్చని పుకార్లు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు కీర్తి సురేష్ ఏ హీరోతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించలేదు. 'సర్కారు వారి పాట' చిత్రంలో మహేష్ బాబుతో రొమాంటిక్ సన్నివేశాలు ఉన్నప్పటికీ, పూర్తిస్థాయి లిప్ లాక్ లేదు. అయితే, 'రౌడీ జనార్దన్'లో మాత్రం ఇది నిజం కావచ్చని అంచనా వేస్తున్నారు. కీర్తి సురేష్ తన కెరీర్‌లో ప్రయోగాలు చేయడానికి వెనుకాడదు. బాలీవుడ్‌లో 'బేబీ జాన్'తో అడుగుపెట్టినప్పటికీ, ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. అయితే, ఆమెకు అక్కడ కూడా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. నెట్‌ఫ్లిక్స్ కోసం 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో బోల్డ్‌గా నటించబోతున్నట్లు తెలుస్తుంది. పాత పద్ధతిలో వెళితే పని అవ్వదని గ్రహించిన ఈ అమ్మడు రూట్ మార్చినట్లు తెలుస్తుంది. ఇక రౌడీ జనార్దన్ సినిమా విషయానికి వస్తే.. ఇది ఒక మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. విజయ్ దేవరకొండకు 'రౌడీ' ఇమేజ్ ఉండటంతో, ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా సరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ సినిమా గోదావరి జిల్లాల నేపథ్యంలో, స్థానిక రాజకీయాల చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com